వీలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 41 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఆగస్టు 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-







## సెప్టెంబరు రెండో వారంలో


# స్థానిక నోటిఫికేషన్!

-ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సర్కారు సన్నద్ధం

-రేపో ఎల్లుండో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవో

-బీసీ స్థానాలు తేల్చేందుకు వారం గడువు అడిగిన ఈసీ

-10 నాటికి ఎంపీటీసీ, జడ్పీటీసీల తుది ఓటర్ల జాబితా




తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

హైదరాబాద్,

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సెప్టెంబరు రెండో వారంలో నోటిఫికేషన్ రానుంది. మొదట ఎంపీటీసీ, జడ్పీటీ సీ స్థానాలకే ఎన్నికలు నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీలకు ఆ తర్వాత నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లులను ఆమోదించి, తరువాత దానికి సంబంధించిన జీవోను ప్రభుత్వం విడుదల చేయనుంది. ఆదివారం రెండు బిల్లులు ఆమోదం పొందితే సోమ లేదా మంగళవారాల్లో జీవో ఇస్తారని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు తేల్చితే బీసీల స్థానాల కేటాయింపునకు మరో వారం రోజుల గడువు కావాలని ఎన్నికల సంఘం చెప్పినట్లు తెలిసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను సెప్టెంబరు 10 నాటికి ప్రకటించాలని ఎన్నికల సంఘం శనివారం నోటిఫికేషన్ ఇచ్చింది. ఇవన్నీ చూస్తే సెప్టెంబరు రెండో వారంలో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. జూలై 25 వరకు రాష్ట్రంలో రిజర్వేషన్లను ఖరారు చేసి, సెప్టెంబరు 30 లోపు స్థానిక ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఇప్పటికే హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి చెపింది.కోర్టు సూచన నేపథ్యంలో రిజర్వేషన్ల ఖరారుకు ప్రత్యేక కమిషన్ ఇచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకుని దాని ప్రకారం ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులను విడుదల చేయనుంది. అనంతరం స్థానిక ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సమాచారం ఇస్తుంది. అడ్వొకేట్ జనరల్‌తో చర్చించిన తరువాతే 2018 పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేసి, ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించినట్టు శనివారం మీడియా ముందు మంత్రులు చెప్పారు. ఎవరైనా కోర్టుకు వెళితే ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్ల ఖరారుపై కోర్టు తీర్పుకు లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికలే ఆగే పరిస్థితి వస్తే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇచ్చి ఎన్నికలకు వెళ్లే అవకాశాలున్నాయి. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని, తర్వాత సర్పంచి ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అనుసరించిన ఆనవాయితీ ఇదేనని గుర్తు చేస్తున్నారు. రాష్ట్రంలో ఏడాదిన్నరగా పంచాయతీలకు పాలక మండళ్లు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి.

### తుది ఓటర్ల జాబితాకు నోటిఫికేషన్

గ్రామ పంచాయతీల ఓటరు జాబితాల ప్రకటనకు ఎన్నికల కమిషన్ ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చింది. తాజాగా ఎంపీటీసీ, జడ్పీటీసీల పరిధిలోని ఓటరు జాబితాల సవరణ, తుది ఓటరు జాబితా ఖరారు, పోలింగ్ కేంద్రాల వివరాల ప్రకటనకు శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని నోటిఫికేషన్ విడుదల చేశారు. సెప్టెంబరు 6న మండల, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల సమాచారాన్ని ప్రదర్శిస్తారు. 8న రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి ఎన్నికల అధికారులతో సమావేశాలుంటాయి. వాటిలో తెలిపే అభ్యంతరాలను పరిశీలించి 10న తుది ఓటర్ల జాబితాను ఖరారు చేస్తారు.





-మిగతా 3

వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 41 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఆగష్టు 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-




## దివంగత ఎమ్మెల్యే గోపీనాథ్‌కు అసెంబ్లీ సంతాపం

- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ లీడర్ అంటూ రేవంత్ నివాళి
- మండలిలో దివంతగత సభ్యులకు సంతాప తీర్మానం
- ఉభయ సభలు సోమవారానికి వాయిదా

హైదరాబాద్, : ప్రజా స్వేచ్ఛ

తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. నాలుగైదు రోజుల పాటు ఈ సమావేశాలు నిర్వహించే అవకాశాలున్నాయి. నూతనంగా ఎన్నికై– శాసనమండలి సభ్యులను మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభకు పరిచయం చేశారు. అలాగే ఇటీవల మృతిచెందిన మండలి మాజీ సభ్యులు మాగం రంగారెడ్డి, రత్‌ఆకర్‌లకు సభ నివాళి అర్పించిన అనంతరం సోమవారానికి వాయిదే పడింది. అసెంబ్లీలో మరోవైపు ఇటీవల మృతి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సబ సంతాపం ప్రకటించింది.

-మిగతా 3 లో



## ఏడేళ్ళ తర్వాత చైనా గడ్డపై!

- తియాన్‌జిన్ చేరుకున్న ప్రధాని మోడీ
- నేడే చైనా అధ్యక్షుడితో భేటీ
- టారిఫ్‌ల గోల వేళ అందరి చూపు వారిపైనే

తియాన్‌జిన్ : ప్రజా స్వేచ్ఛ

ఏడేళ్ళ తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ చైనా గడ్డపై శనివారం కాలు మోపారు. 2018 జూన్‌లో ఎస్‌సిఓ సదస్సు కోసమే ప్రధాని చైనాలో పర్యటించారు. ఈసారీ అదే సదస్సు కోసం ఉత్తర చైనా ఓడరేవు నగరమైన తియాన్‌జిన్ చేరుకున్నారు. టారిఫ్‌లపై అమెరికా అనుసరిస్తున్న విధానాలతో ఇటీవల కాలంలో భారత్, అమెరికా సంబంధాలు గణనీయంగా క్షీణించాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ చైనా పర్యటన అత్యధిక ప్రాధాన్యతను సంతరించుకుంది. యావత్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) వార్షిక సదస్సుకు హాజరయ్యేందుకే మోడీ వచ్చారు.

-మిగతా 3 లో



## పంచాయతీ ఎన్నికలకు పచ్చజెండా

### రిజర్వేషన్లపై పరిమితి ఎత్తివేత

- రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- అసెంబ్లీలో బిల్లు పెట్టనున్న సర్కారు
- ఆ తరువాత జీవో జారీ చేసే ఛాన్స్

- సెప్టెంబర్‌లోగా స్థానిక ఎన్నికల నిర్వహణకు అంగీకారం
- ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీనల పేర్లు సిఫార్సు

హైదరాబాద్, : ప్రజా స్వేచ్ఛ

తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని నిర్ణయించింది. పంచాయతీ రాజ్ చట్టం2018 సవరణకు ఆమోదం తెలిపిన కేబినెట్.. రిజర్వేషన్ల పరిమితిపై గత ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ అసెంబ్లీలో ప్రత్యేక బిల్లు ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. అసెంబ్లీ తర్వాత ప్రత్యేక జీవో తెచ్చి కులగణన ఆధారంగా తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తోంది. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే దానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెర దింపింది. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సెప్టెంబర్‌లో స్థానిక

-మిగతా 3 లో



## పెన్షన్ ఇవ్వండి సర్

- మాజీ ఎమ్మెల్యే పెన్షన్‌కు అప్లై చేసుకున్న జగదీప్ ధన్‌ఖడ్

న్యూఢిల్లీ,

ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. అయితే, ఇప్పుడు ఆయన మాజీ ఎమ్మెల్యే పెన్షన్ కు దరఖాస్తు చేసుకున్నారు.ధనఖడ్ గతంలో రాజస్థాన్ అసెంబ్లీకి ఎన్నికైన విషయం తెలిసిందే. 1993 నుంచి 1998 వరకూ అజ్మేర్‌లోని కిషన్‌గఢ్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. నిబంధనల ప్రకారం.. రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యే రూ.35వేల పింఛనుకు అర్హులు. ఈ రూల్స్ ప్రకారం..

-మిగతా 3 లో



## కాళేశ్వరం, బీసీ బిల్లుపై నేడు చర్చ

- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, : ప్రజా స్వేచ్ఛ

అసెంబ్లీ సమావేశాలు ఎన్నిరోజులు నిర్వహించాలనే దానిపై ఆదివారం నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. శాసనసభ వ్యవహారాల కమిటీ–(బీఏసీ) సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఆదివారం సభలో చర్చ జరుగుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆదివారం సభలో పెడతాం.

-మిగతా 3 లో

## గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన

### పీసీ ఘోష్ కాదు..పీసీసీ ఘోష్ అంటూ ఎద్దేవా

- ఎరవుల కొరతపై విమర్శలు
- కాళేశ్వరం మొదలు అన్ని అంశాలపైచర్చకు సిద్ధం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్, : ప్రజా స్వేచ్ఛ

శనివారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న ఎరువుల సంక్షోభంపై భారత రాష్ట్ర సమితి వినూత్న నిరసన చేపట్టింది. గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళి అర్పించి అసెంబ్లీకి వచ్చారు. అమరుల స్థూపం వద్ద కాసేపునిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇందులో భాగంగా కనీసం 15 రోజులపాటు– అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని



మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆయన గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడారు.. అసెంబ్లీ సమావేశాలు కనీసం 15 రోజులు లేదా అంతకు మించి నిర్వహించినా తాము సిద్ధమే అని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ అంశాన్ని సభలో పెట్టినా..

-మిగతా 3 లో



## జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

- 'హ్యూమన్ జీపీఎస్'గా పేరొందిన ఉగ్రవాది బగు ఖాన్ హతం

న్యూఢిల్లీ,

'ఆపరేషన్ సిందూర్'తో మొదలైన ఉగ్రవాదుల ఏరివేత ఇప్పటికీ కొనసాగుతోంది. జమ్ముకశ్మీర్‌లో తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో 'హ్యూమన్ జీపీఎస్'గా పేరొందిన ఉగ్రవాది హతమయ్యాడు. ఉగ్రకుట్రలు పన్నడం, సరిహద్దు వెంబడి చొరబాట్లకు మూలమైన బగు ఖాన్ అలియాస్ సమందర్ చాచాను శనివారం భారత భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. కరుడుగట్టిన ఉగ్రవాది అయిన బగుఖాన్ 1995 నుంచి పాక్ అక్రమిత కశ్మీర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాడు. భారత్‌లో విధ్వంస కాండకు వ్యూహ రచన చేయడంతో పాటు ఉగ్రమూకల్ని సరిహద్దు దాటించడంలో కీలకమైన పాత్ర పోషించిన బగు ఈసారి తప్పించుకోలేకపోయాడు.శనివారం మరొక టెర్రరిస్ట్‌తో కలిసి నౌషెరా నార్ ప్రాంతంలో బార్డర్ దాటబోయాడు బగు. వాళ్లను అడ్డుకునేందుకు భారత సైన్యం కాల్పులు జరిపింది. ఇరువర్గాల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్లో బగు సహ అతడితో వచ్చిన మరో ఉగ్రవాదిని సైన్యం హతమార్చింది. గురెజ్ సెక్టార్ నుంచి వందకు పైగా జరిగిన చొరబాటు

-మిగతా 3 లో

## యూరియా కొరతపై బీఆర్ఎస్ డ్రామాలు



- వీరి రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు
- మండిపడ్డ వ్యవసాయ మంత్రి తుమ్మల

హైదరాబాద్, : ప్రజా స్వేచ్ఛ

రాష్ట్రంలో యూరియా కొరత ఉందంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ చేసిన ఆందోళనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఫైర్ అయ్యారు. యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వం కారణమని మీకు తెలియదా అంటూ ప్రశ్నించారు. కేంద్రం వల్ల యూరియా కొరత ఉంటే మాపై విమర్శలు చేస్తారా అని బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదంతా కావాలని

-మిగతా 3 లో

## పేదల కోసం తపించిన మహానేత సురవరం

- ఆయన ఆశయాలు కొనసాగించేందకు కృషి
- సురవరం సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి


హైదరాబాద్, : ప్రజా స్వేచ్ఛ

పేదల జీవితాలలో మార్పు రావాలని.. వారి కోసం నిరంతరం శ్రమించిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తను నమ్మిన సిద్ధాంతాలను చివరి వరకు ఆచరించిన అవిశ్రాంత యోధుడని కొనియాడారు. సమాజంలో అనాగరికాలు రూపుమాపేలా ఆయన ఎన్నో చైతన్య



కార్యక్రమాలు చేపట్టారన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభకు సీఎం హాజరయి మాట్లాడారు.

-మిగతా 3 లో




## ఆ గ్రహంపై జీవానికి ఛాన్స్..!

- కీలక గ్యాస్‌లను గుర్తించిన జేమ్స్ వెబ్ టెలీస్కోప్..!

న్యూఢిల్లీ,

ఈ బ్రహ్మాండంలో భూమి కాకుండా మరెక్కడైనా జీవం ఉందా? అని శాస్త్రవేత్తలు సంవత్సరాలుగా పరిశోధనలు జరుపుతున్నారు. ఎక్కడో ఒక చోట జీవం ఉండే ఉంటుందని భావిస్తున్నారు. ఆ జీవం ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పలు గ్రహాలతో పాటు సుదూర ప్రాంతాల్లో ఉన్న నక్షత మండలాలను సైతం పరిశీలిస్తున్నారు. అయితే, ఇప్పటి వరకు జీవం ఆనవాళ్లు మాత్రం దొరకలేదు. ఏళ్లుగా జీవం ఉందా? అన్న ప్రశ్నలకు సమాధానం దొరకబోతున్నది. తాజాగా శాస్త్రవేత్తలకు కీలక సమాచారం దొరికింది. జేమ్స్‌వెబ్ టెలీస్కోప్ కీలక సమాచారాన్ని అందించింది. సూర్యుడికి 124 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న కే218బీ అనే గ్రహం వాతావరణంలో శాస్త్రవేత్తలను పరిశీలించారు.ఇక్కడ ఆసక్తికర ఫలితాలు

-మిగతా 3 లో

-మిగతా

# ఆపరేషన్ సిందూర్‌లో 50 ఆయుధాలు కూడా వాడలేదు

### - ఐఏఎఫ్ అధికారి



**న్యూఢిల్లీ, : ప్రజా స్వేచ్ఛ**
పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా మే 7వ తేదీన విరుచుకుపడింది. ఈ ఆపరేషన్‌లో దాయాదికి భారీ నష్టం వాటిల్లింది. భారత్ చేపట్టిన దాడులకు పాక్ కాళ్లబేరానికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆ ఆపరేషన్‌కు సంబంధించిన కీలక విషయాలను ఎయిర్ స్టాఫ్ వైస్ చీఫ్ ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ తాజాగా పంచుకున్నారు. ఈ ఆపరేషన్‌లో 50 కంటే తక్కువ ఆయుధాలనే వినియోగించినట్లు చెప్పారు.ఓ జాతీయ మీడియా సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 'పాక్‌తో ఘర్షణలు ఆపేందుకు ఐఏఎఫ్ చాలా తక్కువ ఆయుధాలనే వినియోగించింది. ఈ ఆపరేషన్‌లో 50 కంటే తక్కువ ఆయుధాలతోనే పాక్‌తో ఘర్షణలను ఆపగలిగాం. మన బలగాలు నియంత్రణ రేఖ వెంట అత్యంత కచ్చితత్వంతో పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లోని లక్ష్యాలను ఛేదించాయి. ఈ దాడులకు తట్టుకోలేక పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. మే 10న పాకిస్థాన్ సీజ్‌ఫైర్‌కు దిగొచ్చింది. యుద్ధాన్ని ప్రారంభించడం చాలా సులభం. కానీ దాన్ని ముగించడం అంత సులువైన పని కాదు. అందుకే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా మన బలగాలను సంసిద్ధంగా ఉంచాం' అని ఆయన చెప్పుకొచ్చారు.

# రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్..


### టీటీఈ దగ్గరే ఇకపై టికెట్ కొనుక్కోవచ్చు!



**న్యూఢిల్లీ, : ప్రజా స్వేచ్ఛ**
రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. టికెట్ల కోసం ఇకపై రైల్వే స్టేషన్లలో క్యూలైన్లలో నిల్చోవాల్సిన అవసరం లేదు. బస్సుల్లో మాదిరిగానే రైలులోనే ఇకపై టికెట్లను తీసుకోవచ్చు. టీటీఈలు, టికెట్ తనిఖీ బృందాలు ఈ టికెట్లను జారీ చేయనున్నాయి.రైల్వే స్టేషన్లలోని టికెట్ కౌంటర్ల వద్ద రద్దీ నుంచి ఉపశమనం కలిగించేందుకు రైల్వే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మొబైల్ టికెటింగ్‌ను రాయ్‌పూర్ రైల్వే స్టేషన్లలో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. టీటీఈ, టికెట్ తనిఖీ బృందానికి అరచేతిలో ఇమిడి ఉండే పరికరాన్ని అందజేశారు. వాటి సాయంతో ప్రయాణికులు ఎంతమంది, ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలన్న వివరాలను నమోదు చేస్తున్నారు. అనంతరం వారికి అందజేసిన ప్రింటర్ల ద్వారా టికెట్లు జారీ చేస్తున్నారు. ఈ విధానాన్ని త్వరలోనే దేశవ్యాప్తంగా అన్ని మేజర్ స్టేషన్లలో ప్రవేశపెట్టేందుకు రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# పోర్న్‌సైట్‌లో మహిళా ప్రధాని మార్ఫింగ్ ఫొటోలు..

### ఆ దేశంలో తీవ్ర కలకలం



**న్యూఢిల్లీ, : ప్రజా స్వేచ్ఛ**
మార్ఫింగ్ ఫొటోలు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. సామాన్యులతోపాటూ సెలబ్రిటీల ఫొటోలు కూడా కొందరు అభ్యంతరకరంగా మార్ఫింగ్ చేసి పోర్నోగ్రఫీ వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేస్తున్నారు. తాజాగా ఇటలీ లో మార్ఫింగ్ పొటోల వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. ఏకంగా ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనీ ఫొటోలనే మార్ఫింగ్ చేసి పోర్న్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం చర్చకు దారి తీసింది.ఇటలీ ప్రధాన మంత్రి మెలోని సహా ఆమె సోదరి, ఆ దేశంలోని ప్రముఖ మహిళా నేతలకు చెందిన మార్ఫింగ్ ఫొటోలు 'ఫికా' అనే పోర్నోగ్రఫీ వెబ్‌సైట్‌లో దర్శనమిచ్చాయి. మార్ఫింగ్ చేసిన ఫోటోలతో వీడియోలను రూపొందించి అప్‌లోడ్ చేశారు. ఈ వెబ్‌సైట్‌కి దాదాపు 700,000 కంటే ఎక్కువ మంది సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. ఈ వ్యవహారం ఆ దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. దీనిపై ప్రధాని మెలోనీ తీవ్రంగా స్పందించారు. తన ఫొటోలు, ఇతర మహిళలకు సంబంధించిన చిత్రాలను అశ్లీల వెబ్‌సైట్‌లో ప్రసారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనను అసహ్యకరమైన చర్యగా అభివర్ణించారు. అంతేకాదు, నేరస్థులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.'జరిగిన ఘటన పట్ల నాకు అసహ్యం వేస్తోంది. ఈ చర్య ద్వారా అవమానానికి, హింసకు గురైన మహిళలందరికీ నా పూర్తి సంఘీభావం, మద్దతు ఉంటుంది. 2025లో కూడా ఒక మహిళ గౌరవాన్ని కించపరచడం దారుణం. అజ్ఞాతంలో ఉండి మహిళలను లైంగిక, అశ్లీల దూషణలతో దాడి చేయడం బాధాకరం. ఈ ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించాం. త్వరలోనే నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తాం' అని మెలోనీ తెలిపారు.

# సెప్టెంబర్ 7న అరుదైన బ్లడ్‌మూన్..!

### ఈ సారి భారత్‌లో కనిపిస్తుందా..?




తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



**న్యూఢిల్లీ, : ప్రజా స్వేచ్ఛ**
ఖగోళ ప్రియులకు గుడ్‌న్యూస్. వచ్చే నెల సెప్టెంబర్ 7న అరుదైన సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనున్నది. ఈ సమయంలో చంద్రుడు ఎరుపురంగులో మెరిసిపోనున్నాడు. దీన్ని బ్లడ్‌మూన్'గా పిలుస్తారు. భారతదేశం సహా ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల్లో ఈ గ్రహణం స్పష్టంగా కనిపించనుంది. అమెరికా ఖండంలో మాత్రం గ్రహణం కనిపించదని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈ చంద్రగ్రహణం ఏడాది రెండోది కావడం విశేషం. తొలి చంద్రగ్రహణం మార్చి 14న ఏర్పడగా.. అది భారత్‌లో కనిపించలేదు. సెప్టెంబర్ 7న జరగబోయే గ్రహణం దేశంలో చాలాచోట్ల స్పష్టంగా కనిపించనున్నది. దాంతో సూతకాలం వర్తిస్తుందని జ్యోతిషపండితులు పేర్కొంటున్నారు. గ్రహణం నేపథ్యంలో ఆలయాలు మూతపడనున్నాయి.సెప్టెంబర్ 7న పెనుంబ్రల్ గ్రహణం రాత్రి రాత్రి 8:58 గంటలకు ప్రారంభమవుతుంది. పాక్షిక చంద్రగ్రహణం రాత్రి 9:57 గంటలకు మొదలవుతుంది. ఇక సంపూర్ణ గ్రహణం రాత్రి 11:30 గంటలకు మొదలవుతుంది. గరిష్ఠ గ్రహణం అర్ధరాత్రి 12.11 గంటలకు దర్శనమిస్తుంది. సంపూర్ణ సూరగ్రహణం రాత్రి 12:52 గంటలకు పూర్తవుతుంది. పాక్షిక గ్రహణం తెల్లవారు జామున 1:56 గంటలకు, పెనుంబ్రల్ గ్రహణం ఉదయం 2:55గంటలకు ముగుస్తాయి. మొత్తం గ్రహణ దశలు కలిపితే 5.27గంటలు ఉంటుంది. సంపూర్ణ గ్రహణం 82 నిమిషాలు ఉంటుంది.సంపూర్ణ చంద్రగ్రహణం సమయంలో చంద్రుడు ఎరువు వర్ణంలోకి మారిపోనున్నాడు. భూమి నీడ (ఉంబ్రా)లో పూర్తిగా చంద్రుడు ఉంటాడు. ఈ సమయంలో భూమి వాతావరణం సూర్యకాంతిని వడపోస్తుంది. ఎరుపు రంగు కాంతి మాత్రమే చంద్రుడిపై పడుతుంది. దాంతో చంద్రుడు ఎరుపుగా కనిపిస్తాడు. దీన్నే బ్లడ్‌మూన్‌గా పిలుస్తారు. ఈసారి చంద్రుడి గ్రహణ తీవ్రత 1.362గా ఉండడంతో చంద్రుడు మరింత లోతుగా భూమి నీడలోకి వెళ్లి, మామూలు కన్నా బాగా ఎరుపు రంగులో మెరుస్తాడని నిపుణులు చెబుతున్నారు.ఈ సారి ఈ గ్రహణం భారతదేశవ్యాప్తంగా కనిపిస్తుంది. ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో సంపూర్ణంగా చూడవచ్చు. బ్యాంకాక్, బీజింగ్, హాంగ్‌కాంగ్, సిడ్నీ వంటి నగరాల్లోనూ మొత్తం గ్రహణ దశలు స్పష్టంగా కనిపిస్తాయి. ఈ ప్రాంతాల్లో అర్ధరాత్రి సమయంలో చంద్రుడు నెమ్మదిగా ఎరుపు రంగులోకి మారతాడు. ఈ చంద్రగ్రహణాన్ని చూడవచ్చని నిపుణులు తెలిపారు.

# ప్రధాని పర్యటనకు ముందు.. వినాయకుడి చిత్రాన్ని షేర్ చేసిన చైనా..!



**న్యూఢిల్లీ, : ప్రజా స్వేచ్ఛ**
ప్రధాని నరేంద్ర మోదీ జపాన్ పర్యటన ముగించుకొని చైనాకు బయలుదేరారు. ప్రధాని చైనా పర్యటనకు ముందు శనివారం భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేసింది. భారత్-చైనా కళ, విశ్వాసం, సంస్కృతులను పంచుకున్నాయని పేర్కొంది. చైనా రాయబార కార్యాలయం ప్రతినిధి యు జింగ్ ట్వీట్ చేస్తూ.. 'చైనాలోని టాంగ్ రాజవంశం, మొగావో గుహలలో గణేశుడి ప్రతిమను చూడవచ్చు! శతాబ్దాల కిందట చైనా, భారత్ కళ, విశ్వాసం, సంస్కృతిని ఎలా పంచుకున్నాయనేదానికి ఇది రుజువు' పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ ఒకటి వరకు చైనాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశానికి హాజరవుతారు. భారతదేశం-అమెరికా మధ్య సుంకాల వివాదం కొనసాగుతున్న సమయంలో భారత్, చైనా తమ సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ చైనా పర్యటన కీలకంగా పరిగణిస్తున్నారు. భారత్-చైనా దేశాలు వేల సంవత్సరాల నుంచి సాంస్కృతిక, చారిత్రక సంబంధాలను కలిగి ఉన్నాయి. రెండుదేశాల మధ్య నమ్మకం, సహకారానానికి సాంస్కృతిక దౌత్యం కీలకమైందని నిపుణులు పేర్కొంటున్నారు. చైనాలోని భారత రాయబార కార్యాలయం రెండు దేశాల మధ్య చారిత్రక సంబంధాలను సైతం ప్రస్తావించింది. చైనాలోని భారత రాయబార కార్యాలయం 'భారత్-చైనా మధ్య సంబంధాల గురించి కనీసం రెండో శతాబ్దం నుంచి లిఖితపూర్వకంగా రికార్డులు ఉన్నాయి.ఇది తర్వాత బౌద్ధమతం, వాణిజ్యం ద్వారా బలపడ్డాయని తెలిపింది. ప్రధాని మోదీ రాబోయే పర్యటన సమకాలీన సమస్యలను చర్చించడానికి అవకాశాన్ని కల్పించడమే కాకుండా, రెండు దేశాల ఉమ్మడి వారసత్వాన్ని పునరుద్ధరించడానికి సైతం అవకాశం కల్పిస్తుంది' అని తెలిపింది. 366 ఏడీ నుంచి 10వ శతాబ్దం వరకు నిర్మించిన చైనాలోని గన్సు ప్రావిన్స్‌లోని డన్‌హువాంగ్‌లోని మోగావో, వెయ్యి బుద్ధ గుహలు భారతీయ బౌద్ధ కళను గుర్తుకు తెస్తాయి. జిన్జియాంగ్‌లోని బెజెక్లిక్, కిజిల్ గుహలు, లుయాంగ్‌లోని లాంగ్‌మెన్ గుహలు, దట్సులోని బావోడింగ్ గుహలు, దటోంగ్‌లోని యుంగాంగ్ గుహల్లోనూ భారతీయత కనిపిస్తుంది. బోధ్ గయ ఆలయ శైలిలో నిర్మించిన బీజింగ్‌లోని ఫైవ్ పగోడా ఆలయం, లుయోయాంగ్‌లోని వైట్ హార్స్ ఆలయం రెండు దేశాల మధ్య చారిత్రక సంబంధాలను సూచిస్తాయి.


# వరల్డ్ బీర్ అవార్డ్స్‌లో సత్తా చాటిన 'సింబా'..!




**న్యూఢిల్లీ, : ప్రజా స్వేచ్ఛ**
భారతదేశానికి చెందిన ప్రముఖ క్రాఫ్ట్ బీర్ బ్రాండ్ 'సింబా' అంతర్జాతీయ వేదికపై సత్తాచాటింది. ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే 'వరల్డ్ బీర్ అవార్డ్స్ 2025'లో రెండు పతకాలను కైవసం చేసుకుని, భారత బీర్ పరిశ్రమ గౌరవాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టింది. ఇందులో 'సింబా విట్' రజత పతకాన్ని, 'సింబా స్టౌట్' కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ముఖ్యంగా, భారతదేశం తరఫున 'కంట్రీ విన్నర్స్ టేస్ట్' కేటగిరీలో పతకాలు లభించడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా బీర్ తయారీ నిపుణులు, పరిశ్రమ విశ్లేషకులు, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించే ఈ అవార్డ్స్ ప్రత్యేకత ఏమిటంటే.. ఇందులో 'బ్లైండ్ టేస్టింగ్ పద్ధతి'ని అనుసరించి విజేతలను ప్రకటిస్తారు. అంటే బ్రాండ్ పేరు తెలియకుండా కేవలం రుచిని ఆధారంగా తీసుకుని విజేతలను నిర్ణయిస్తారు. ఇంతటి కఠిన పోటీలోనూ సింబా బీర్లు ప్రత్యేకతను నిరూపించుకోవడం విశేషం. రజత పతకం సాధించిన 'సింబా విట్' బెల్జియన్ తరహా బీర్.దీని తయారీలో బార్లీ మాల్ట్, కొత్తిమీర, నారింజ తొక్కలు ఉపయోగించగా.. సిట్రస్ సువాసనలతో తేలికైన, రిఫ్రెషింగ్ రుచిని అందిస్తుందని నిపుణులు ప్రశంసించారు. ఇక కాంస్య పతకం గెలుచుకున్న 'సింబా స్టౌట్'లో రోస్టెడ్ బార్లీ, డార్క్ మాల్ట్స్ వాడగా.. కాఫీ, చాక్లెట్, క్యారమెల్ ఫ్లేవర్స్‌తో విభిన్నమైన అనుభూతినిస్తుందని అభిప్రాయపడ్డారు. క్రీమీ టెక్స్చర్‌తో పాటు చివర్లో స్వల్ప చేదుతో ఇది ప్రత్యేకతను సంతరించుకుంటుందని పేర్కొన్నారు. సింబా బ్రాండ్ సాల్ట్‌బోర్న్' అనే మాతృ సంస్థలో భాగం. వినియోగదారులకు అత్యుత్తమ నాణ్యతతో కూడిన ఉత్పత్తులను అందించడమే లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తోంది. సంప్రదాయానికి ఆధునికతను జోడించి, నాణ్యమైన ముడి పదార్థాలతో ఉత్పత్తులను తయారు చేయడం కంపెనీ ప్రత్యేకత. సింబా బీర్‌తో ప్రస్థానం ప్రారంభించిన సాల్ట్‌బోర్న్.. తరువాత 'జిగ్‌జాగ్ వోడ్కా' వంటి స్పిరిట్స్ విభాగంలోకి కూడా అడుగుపెట్టింది. ఉత్పత్తుల నాణ్యత విషయంలో ఎప్పుడూ రాజీ పడకపోవడమే సింబా విజయానికి మూలకారణమని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

# భారత్‌తో చర్చలకు సిద్ధం..

### పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్



**న్యూఢిల్లీ, : ప్రజా స్వేచ్ఛ**
భారత్ తో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు దాయాది పాకిస్థాన్ మరోసారి ప్రకటించింది. కశ్మీర్ సహా అన్ని సమస్యల పరిష్కారానికి న్యూ ఢిల్లీతో గౌరవప్రదమైన చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. ఈ మేరకు పాక్ విదేశాంగ మంత్రి ఉప ప్రధాని ఇషాక్ దార్ మాట్లాడుతూ.. 'జమ్ము కశ్మీర్ వివాదం సహా అన్ని సమస్యల పరిష్కారానికి భారత్‌తో గౌరవప్రదమైన రీతిలో చర్చలు జరిపేందుకు పాక్ సిద్ధంగా ఉంది' అని తెలిపారు.కాగా, పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత తోక ముడిచిన పాక్.. అనేక సార్లు కాళ్ల బేరానికి వచ్చింది. న్యూ ఢిల్లీతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఎప్పటికప్పుడు ప్రకటిస్తూ వస్తోంది. అయితే, భారత్ మాత్రం పాక్ అభ్యర్థనను తిరస్కరిస్తూ వస్తోంది. ఉగ్రవాదం, చర్చలు రెండూ ఏకకాలంలో ఉండవని వెల్లడించింది. ఆ దేశంతో చర్చలు జరిగితే కేవలం ఉగ్రవాదం, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)పైనే ఉంటాయని స్పష్టం చేస్తోంది.

www.prajaswecha.com ప్రజా స్వేచ్ఛ PRAJA SWECHA

## దివంగత ఎమ్మెల్యే గోపీనాథ్‌కు అసెంబ్లీ సంతాపం

(మొదటి తరువాయి)

గోపీనాథ్ మృతిపట్ల సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. విద్యార్థి రాజకీయాల్లో గోపీనాథ్ చురుగ్గా ఉండేవారని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా పని చేశారని, ఎన్టీఆర్‌కు విశ్వాసపాత్రుడిగా గోపీనాథ్‌కు సత్సంబంధాలు ఉండేవన్నారు. విద్యార్థి నేతగా , ప్రజాప్రతినిధిగా, సినీ నిర్మాతగా రాణించారని చెప్పారు. గోపీనాథ్ తనకు మంచి మిత్రుడని, సన్నిహితుడని గుర్తు చేసుకున్నారు. గోపీనాథ్ తనకు చిన్ననాటి నుంచే మిత్రుడని పేర్కొన్నారు. ఆయన మృతి తనను వ్యక్తిగతంగా తీవ్రంగా కలిచివేసిందని గోపీనాథ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సంతాప తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా సీఎం రేవంత్ మాగంటి గోపీనాథ్ జీవన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. రాజకీయంగా పార్టీలు వేరైనా.. వ్యక్తిగతంగా నాకు మంచి మిత్రుడని తెలిపారు. ఆయన విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా ఉన్నారని అన్నారు. 1983లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో ఆయన తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారని.. 1985 నుండి 1992 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తెలుగు యువత అధ్యక్షుడిగా సేవలందించారని తెలిపారు. 1987-88 లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ- డైరెక్టర్‌గా 1988-93లో జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుడిగా విశేష కృషి చేశారు. గోపీ ఎన్టీఆర్‌కు గొప్ప భక్తుడు. సినీరంగంలోనూ నిర్మాతగా రాణించారు. వరసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్ని-కై- ఘనత సాధించిన వారిలో మాగంటి గోపీనాథ్ ఒకరని అసెంబ్లీలో సీఎం రేవంత్ తెలియజేశారు. చూడటానికి ఆయన క్లాస్ గా కనిపించినా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఆయన మాస్ లీడర్ అని అన్నారు. గోపీనాథ్ అకాల మరణం వారి కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చిందని.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు- పేర్కొన్నారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లు మాట్లాడుతూ గోపీనాథ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గోపీనాథ్‌తో తనకు చిరకాల మిత్రుత్వం ఉందని శ్రీధర్ బాబు అన్నారు. తరవాత కెటిఆర్, ఇతర సభ్యులుఉమాట్లాడుతూ గోపీనాథ్ మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం సభ సోమవారానికి వాయిదా పడింది.

## ఏడేళ్ళ తర్వాత చైనా గడ్డపై!

(మొదటి తరువాయి)

అయితే ఆదివారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జరపబోయే సమావేశం మరింత ప్రాధాన్యంగా మారింది. వాషింగ్టన్ చేపట్టిన టారిఫ్ చర్యలతో ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రధాన ఆర్థిక వ్యవస్థలూ ప్రభావితమయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఇరువురు నేతల సమావేశంపైనే అందరి దృష్టి వుంది. ఈ చర్చల సందర్భంగా భారత్, చైనాల మధ్య ఆర్థిక సంబంధాలను ఇరువురు నేతలు సమీక్షిస్తారని భావిస్తున్నారు. తూర్పు లడఖ్ సరిహద్దు వివాదం నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నందున వాటిని తిరిగి సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై వారు మాట్లాడుకుంటారని భావిస్తున్నారు. షాంఘై సదస్సును పురస్కరించుకుని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా పలువురు నేతలతో మోడీ ద్వైపాక్ష చర్చలు జరుపుతారని భావిస్తున్నారు. జపాన్‌లో రెండు రోజుల పర్యటన ముగించుకుని ప్రధాని తియాన్‌జిన్ చేరుకున్నారు. ఈ పర్యటనకు ముందు ప్రధాని మోడీ మాట్లాడుతూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఒక సుస్థిరతను తీసుకురావడానికి భారత్, చైనాలు కలిసి కృషి చేయడం చాలా ముఖ్యమనిజపాన్‌లో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ సందర్భంగా వ్యాఖ్యానించారు. భారత్, చైనాల మధ్య సుస్థిరమైన, సామరస్యమైన ద్వైపాక్షిక సంబంధాలు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి, సంక్షేమాలపై సానుకూల ప్రభావాన్ని కనబరుస్తాయని అన్నారు.

## పెన్షన్ ఇవ్వండి సర్

(మొదటి తరువాయి)

ఆయన 2019 జులై వరకూ మాజీ శాసనసభ్యుడిగా ధన్‌ఖడ్ పెన్షన్ పొందారు. అయితే, పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమితులవడంతో పెన్షన్ ఆగిపోయింది. 2019 నుంచి 2022 మధ్య పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2022 ఆగస్టులో ఉపరాష్ట్రపతిగా నియమితులయ్యారు. ఇప్పుడు ఉపరాష్ట్రపతిగా తన పదవీకాలం ముగియడంతో మాజీ ఎమ్మెల్యేగా తన పెన్షన్‌ను తిరిగి ప్రారంభించాలని కోరుతూ ధన్‌ఖడ్ రాజస్థాన్ అసెంబ్లీ సచివాలయానికి కొత్తగా దరఖాస్తు పెట్టుకున్నారు. ఈ విషయాన్ని రాజస్థాన్ అసెంబ్లీ స్పీకర్ వాసుదేవ్ దేవనాని తాజాగా వెల్లడించారు. మాజీ ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ మాజీ ఎమ్మెల్యే పెన్షన్‌కు దరాఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. దానికి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.కాగా, రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యేకు రూ.35వేల పెన్షన్ వస్తుంది. అంతేకాదు వయసు ఆధారంగా ఆ మొత్తంలో పెంపు కూడా ఉంటుంది. 70 ఏళ్లు దాటిన మాజీ ఎమ్మెల్యేకి 20 శాతం అదనపు పింఛను అందుతుంది. 80 ఏళ్లు దాటితే అది 30 శాతంగా ఉంటుంది. ప్రస్తుతం ధన్‌ఖడ్ వయసు 74 ఏళ్లు కావడంతో ఆయనకు మాజీ ఎమ్మెల్యే పెన్షన్ కింద రూ.42 వేల వరకు వస్తుంది.

## కాళేశ్వరం, బీసీ బిల్లుపై నేడు చర్చ

(మొదటి తరువాయి)

కాళేశ్వరంపై సభలో భారత రాష్ట్రసమితి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు స్పీకరే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. అన్ని అంశాలపై చర్చ చేయాలంటే.. నాలుగైదు రోజుల తర్వాత సభ నడుపుతాం. గణేష్ నిమజ్జనం, వరదల దృష్ట్యా సభను వాయిదా వేయాలని శ్రీధర్‌బాబు తెలిపారు. అయితే బీఏసీ సమావేశం నుంచి భారత రాష్ట్ర సమితి వాకౌట్ చేసింది. ఎరువుల కొరత, వరదలు, రైతుల సమస్యలపై చర్చ జరగాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేశారు. స్పష్టమైన హామీ రాకపోవడంతో బీఏసీ నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు.

## ఆ గ్రహంపై జీవానికి ఛాన్స్..!

(మొదటి తరువాయి)

వెల్లడయ్యాయి. ఈ గ్రహంలో డైమెథైల్ సల్ఫైడ్ , డైసల్ఫైడ్ అనే రసాయనాలు ఉన్నట్లుగా గుర్తించారు. భూమిపై ఇవి దాదాపు పూర్తిగా జీవక్రియ ద్వారా మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయని.. ముఖ్యంగా అల్గే వంటి సూక్ష్మ జీవుల ద్వారా ఉత్పత్తి అవుతుంటాయని పేర్కొంటున్నారు. ఈ గ్యాస్‌లు జీవం ఉన్నదానికి సాక్ష్యం కాదు కానీ.. బలమైన సంకేతాలుగా పరిగణించవచ్చని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇది జీవం ఉందన్న భావనకు బలమైన సంకేతాలని కేంబ్రిడ్జి యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ నిక్కు మధుసూదన్ పేర్కొన్నారు. ఆయన ఈ పరిశోధనకు నేతృత్వం వహించారు. ఈ గ్యాస్‌లు భూమిపై ఉన్న స్థాయికంటే వేల రెట్లు కేంద్రీకృతమై ఉన్నాయని పేర్కొన్నారు. కే2-18బీ గ్రహం భూమికన్నా 2.5రెట్లు పెద్దగా ఉండగా.. ఇది హ్యాబిటబుల్ జోన్‌లో (జలరూపం ఉండే అవకాశం ఉన్న ప్రాంతం) పరిభ్రమిస్తోందని.. అంటే అక్కడ ద్రవజల రూపంలో నీరు ఉండే అవకాశం ఉందని.. ఇది జీవం ఏర్పడటానికి అవసరమైన మౌలిక ప్రమాణాల్లో ఒకటి పేర్కొంటున్నారు. అయితే, పలువురు శాస్త్రవేత్తలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. జేమ్స్‌వెబ్ టెలిస్కోప్ సేకరించిన డేటాను మళ్లీ విశ్లేషించిన కొన్ని బృందాలు.. ఈ గ్యాస్‌ల ఉనికిపై స్పష్టత ఇంకా తక్కువగానే ఉందని అభిప్రాయపడ్డారు. ఇది ఆ దిశలో ఒక అడుగు మాత్రమేనని.. పూర్తి ఆధారంగా చెప్పలేమని ఇంపీరియల్ కాలేజ్ లండన్‌కు చెందిన డాక్టర్ డేవిడ్ క్లెమెంట్స్ పేర్కొన్నారు. జీవం ఉందని ప్రకటించడానికి శాస్త్రవేత్తలు 'ఫైవ్ సిగ్మా థ్రెషోల్డ్' అని పిలవబడే, 99.99999 శాతం విశ్వాసం సాధించాల్సి ఉంటుందని.. ఈ దశలో ఏ ఆధారాలు పూర్తిగా నిర్ధారించబడి ఉన్నాయని చెప్పలేమని పేర్కొంటున్నారు. మరో వైపు జేమ్స్‌వెబ్ టెలిస్కోప్ ఇంకా మరికొన్ని పరిశోధనలు చేపట్టనున్నారు.

# పంచాయతీ ఎన్నికలకు పచ్చ జెండా

(మొదటి తరువాయి)

సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శనివారం భేటీ- అయిన తెలంగాణ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు చేసింది. స్థానిక ఎన్నికల రిజర్వేషన్లలో పరిమితి ఎత్తివేయాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం పేర్లను గవర్నర్‌కు క్యాబినెట్ సిఫార్సు చేసింది. అసెంబ్లీ కమిటీ- హాలులో జరిగిన ఈ మంత్రివర్గ సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంతోపాటు-, ఇటీ-వలి వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంపైనా చర్చించారు. పంటలు, రోడ్లు, ఇతర నష్టాలపై కేంద్ర ఆర్థికశాఖ సాయం కోరుతూ తీర్మానం చేశారు. కేబినేట్ వివరాలను మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు. మరోవైపు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి కూడా క్యేబినెట్ నిర్ణయం తీసుకుందని అన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్‌లోగా జరపాలని కోర్టు ఆదేశించింది. మొత్తం రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి మించకూడదని గత ప్రభుత్వం 2018 ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనిపై ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసి గవర్నర్ కు పంపింది. ప్రస్తుతం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి దగ్గర పెండింగ్ లో ఉందన్నారు. ముస్లిం కోటా పేరుతో బీజేపీ బిల్లును అడ్డుకుంటోంది. రాష్ట్రపతి ఆమోదం తెలపకుండా ప్రధాని మోదీ సర్కార్ అడ్డుకుంటోంది. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలపాలని ఢిల్లీలో నిరసన కూడా తెలిపినట్లు వెల్లడంచారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ లుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను సిఫారసు చేస్తూ తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పుతో కేబినెట్ మరోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పేర్లను సిఫారసు చేసింది. అయితే కోదండరాం పేరుతో పాటు- ఈ సారి అమీర్ అలీ ఖాన్ స్థానంలో అజారుద్దీన్ కు స్థానం కల్పించాలని నిర్ణయించారు. ఎమ్మెల్సీలుగా కోదండరాం, ఆమిర్ అలీఖాన్ నియామకాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ 2024 ఆగస్టులో సుప్రీంకోర్టులో సివిల్ అప్లికేషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ ను విచారించిన సుప్రీం కోర్టు.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంలో ప్రొఫెసర్ కోదండరాం, ఆమిర్ అలీ ఖాన్ కేసు విషయంలో 2025 ఆగస్టు 13 న స్టే విధించింది. 2024 ఆగస్టు 14న తాము ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల తర్వాత జరిగిన పరిణామాలు ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఉంటే ఎమ్మెల్సీల నియామకాన్ని రద్దు చేస్తామని వ్యాఖ్యానించింది. అయితే.. ఏదైనా తుది ఉత్తర్వులకు లోబడే ఉంటుందని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను 2025 సెప్టెంబర్ 17కు వాయిదా వేసింది. ఈ క్రమంలో మరోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లను సిఫారసు చేసింది తెలంగాణ కేబినెట్.. ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను ఖరారు చేసింది. అయితే ఈ సారి అమీర్ అలీ ఖాన్ ప్లేసులో అజారుద్దీన్ కు అవకాశం కల్పించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో అజారుద్దీన్ కు ఎమ్మెల్సీ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. దీంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరపున కొత్త అభ్యర్థికి అవకాశం రానుంది. ఇకపోతే బీసీ రిజర్వేషన్లపై కేబినెట్‌లో కీలక చర్చ జరిగిందని, అసెంబ్లీలో రిజర్వేషన్ బిల్లులను ఆమోదిస్తాం అని పొంగులేటి అన్నారు. భారీ వర్షాలతో కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లింది. పంట, ఆస్తి, రహదారుల నష్టం అధికంగా జరిగింది. వరద నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు చెప్పాం. వర్షాల వల్ల జరిగిన నష్టం అంచనాల పై సెప్టెంబర్ 4న ఉన్నతాధికారుల సమావేశం నిర్వహిస్తాం అన్నారు. గోలల పాలసీ విధి విధానాలపై చర్చించాం. 2022 - 23 లో రబీ ధాన్యం సేకరణకు టెండర్లు పిలిచారు. మిల్లర్లకు ఇచ్చిన 7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రికవరీ కాలేదు.. వారి పై పీడీ యాక్ట్ పెట్టడాని-కై-నా ప్రభుత్వం వెనకాడదు. మత్స్య సహకార సంఘాలకు పర్సనల్ ఇంచార్జీలను నియమించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ కు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు.

# గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన

(మొదటి తరువాయి)

అన్నింటికీ సరైన సమాధానం ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగం నుంచి మొదలుకొని ఏ అంశం పైననైనా సభలో చర్చకు పెడితే ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు- పేర్కొన్నారు. వ్యవసాయ విస్తీర్ణంతో పాటు- వ్యవసాయ సంక్షేమానికి మాజీ సీఎం కేసీఆర్ చేసిన కార్యక్రమాలు, పథకాల గురించి వివరిస్తామని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం గురించి కూడా సమాధానం చెబుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, అది కాంగ్రెస్ పార్టీ వేసుకున్న పీసీసీ ఘోష్ కమిషన్ అని కేటీఆర్ విమర్శించారు.

వ్యవసాయ రంగం నుంచి మొదలుకొని ఏ అంశం పైననైనా సభలో చర్చకు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాము. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం గురించి కూడా సమాధానం చెబుతాం. అసమ్మతి ఎమ్మెల్యేలకు సంబంధించిన అంశంలో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూద్దాం. ఇప్పటికే అసమ్మతి ఎమ్మెల్యేలకు సంబంధించిన పక్రియ కొనసాగుతోంది, ఏ నిర్ణయం తీసుకుంటారో చూద్దాం అని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు శాసనసభను తమకు అనుకూలంగా ఉండేలా నడిపించే ప్రయత్నం చేస్తోంది. రైతుల సమస్యల పైన, రాష్ట్రంలో ఉన్న ఎరువుల సంక్షోభం పైన మాట్లాడటం లేదు. 10 సంవత్సరాల పాటు కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ రోజు కూడా ఇలాంటి ఎరువుల కొరత రాలేదు. రైతులు లైన్లలో నిలబడాల్సిన దుస్థితి రాలేదు. మరి ఎందుకు ఈరోజు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెప్పులను లైన్లో పెట్టడం, ఆధార్ కార్డులను లైన్లో పెట్టే పరిస్థితి వచ్చింది? పండుగ రోజు కూడా రైతులు ఎరువుల కోసం లైన్లలో నిలబడి, వర్షంలో తడిసి ఇబ్బందులు పడే పరిస్థితి ఎందుకు వచ్చింది? పంట నష్టపోయిన రైతుల గురించి కానీ, భారీ వర్షాల వల్ల ఇబ్బందుల గురించి గానీ సుదీర్ఘంగా చర్చించే అవకాశం అసెంబ్లీలో ఇవ్వండి. రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ సంక్షోభం పైన అసెంబ్లీలో చర్చ పెట్టాలి అని కేటీ-ఆర్ డిమాండ్ చేశారు. 600కు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. 75 లక్షల మంది రైతులు ఈరోజు అవస్థల్లో ఉన్నారు. రైతులకు కాంగ్రెస్ చేసిన మోసంపైన అసెంబ్లీలో చర్చ జరగాలి. ఆరు గ్యారెంటీ-ల నుంచి 420 హామీల అమలు వైఫల్యాల దాకా అన్ని అంశాలపైన చర్చిద్దాం. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారు, వాటి పైన చర్చ జరగాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉండే ఒకటి రెండు అంశాల పైననే మాట్లాడే ప్రయత్నం చేస్తోంది. ప్రజల కష్టాలు, సమస్యల పైన చర్చలకు అసెంబ్లీ వేదిక కావాలి. కనీసం 15 రోజులపాటు- అసెంబ్లీ సమావేశాలు జరగాలి. కాళేశ్వరంతో పాటు- అన్ని అంశాల పైన సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నాము. పీసీ ఘోష్ కమిషన్ పైన కూడా కాంగ్రెస్ పార్టీకి సమాధానం చెప్పడానికి మేము సిద్ధంగా ఉన్నాం అని కేటీఆర్ స్పష్టం చేశారు

## పేదల కోసం తపించిన మహానేత సురవరం

(మొదటి తరువాయి)

మొదటితరంలో సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు వంటి వారు పాలమూరు జిల్లాకు వన్నెతెచ్చారు. రెండో తరంలో జైపాల్‌రెడ్డి, సురవరం సుధాకర్‌రెడ్డి వంటివారు రాజకీయాల్లో రాణించారు. జైపాల్‌రెడ్డి దక్షిణ భారత్ నుంచి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎన్నికైన యువ ఎంపీగా ప్రజల్లో నిలిచిపోయారని అన్నారు. అదే కోవలో సురవరం సుధాకర్‌రెడ్డి కూడా గుర్తింపు తెచ్చుకున్ననేత అన్నారు. సిపిఐ కార్యార్శిగా, ఎంపిగా ఆయన చిరస్మరణీయ సేవలు అందించారని అన్నారు. ఆయన సిద్ధాంతాలు ప్రజలకు అర్థమయ్యేలా చేస్తాం. ప్రజలకు సురవరం సుధాకర్‌రెడ్డి ఎప్పుడూ గుర్తుండేలా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు. రాజకీయం అంటేనే అధికారం అన్నట్టుగా కొందరు వ్యవహరిస్తున్నారు. అధికారంలో ఉంటాం కానీ, ప్రతిపక్షంగా ఉండలేమన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఐదేళ్లు కూడా ప్రతిపక్షంగా వ్యవహరించేందుకు కొందరు ఇష్టపడట్లేదని పరోక్షంగా బిఆర్ఎస్‌పై విసుర్లు విసిరారు. కమ్యూనిస్టులు మాత్రం ఎన్నేళ్లు అయినా ప్రతిపక్షంలో ఉండేందుకు ఇష్టపడతారు. ప్రజల తరపున మాట్లాడటం, పోరాడటం పెద్ద బాధ్యత. ప్రస్తుత రాజకీయాల్లో ప్రజల తరఫున పోరాడేందుకు నేతలు ముందుకు రావట్లేదు. సమస్యలపై పోరాడి.. ప్రజావ్యతిరేక ప్రభుత్వాలను దించడంలో కమ్యూనిస్టులు ముందున్నారని సీఎం వ్యాఖ్యానించారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం దిగిపోయినా కమ్యూనిస్టులే కారణమని తన నమ్మకం తనదని సిఎం అన్నారు . రవీంద్ర భారతిలో సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభకు హాజరయ్యారు రేవంత్. సురవరం చిత్రపటానికి నివాళి అర్పించారు. కమ్యునిస్టులంటేనే ప్రతిపక్షమని అన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతం,ఆలోచన ఇంకా పెరగాలన్నారు రేవంత్. కమ్యునిజం అంటే లైబ్రరీలో దొరికే పుస్తకం కాదని.. కమ్యూనిస్టులంటేనే ప్రజల కోసం కొట్లాడే వాళ్లని అన్నారు. కమ్యూనిస్టులంటే ప్రజలకు ఓ భరోసా,నమ్మకం ఉందన్నారు. సురవరం ఉంటే ఓట్ చోరీపై మరింతగా పోరాడే వారన్నారు. మహారాష్ట్రలో నాలుగు నెలల్లో కొత్తగా కోటి మంది ఓటర్లు పుట్టుకొచ్చారని ఆరోపించారు సీఎం రేవంత్. బీహార్ లో 65 లక్షల కొత్త ఓట్లు- వచ్చాయని చెప్పారు. ఓట్ల తొలగింపుతో ఈ సమస్యకు పరిష్కారం దొరకదన్నారు. సురవరం చివరి శ్వాస వరకు సీపీఐతోనే ఉన్నారని.. 65 సంవత్సరాల పాటు- ఎర్రజెండా నీడనే ఉన్నారని కొనియాడారు రేవంత్. సురవరం సామాజిక చైతన్యం ఉన్నవారన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి సూచనతోనే తెలుగు యూనివర్శిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టామన్నారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నారాయణ, మంత్రి జూపల్లి కృష్ణారావు, సీపీఎం నేత బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, గుమ్మడి నర్సయ్య, ప్రొ.హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

(మొదటి తరువాయి)

ప్రయత్నాల్లో బగు ఖాన్ హస్తం ఉందని.. వీటిలో చాలావరకూ విజయవంతం అయ్యాయని భారత సరిహద్దు దళాలు పేర్కొన్నాయి.బగా ఖాన్ తొలి నుంచి ఉగ్రవాద కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేవాడు. అతడు హిజ్‌బుల్ కమాండర్‌గా ఉన్నప్పుడు ప్రతి ఉగ్రదాడి ప్రణాళికలో పాల్గొన్నాడు. సరహద్దు ప్రాంతాలపై పూర్తి అవగాహన కలిగిన బగా గురెజ్, సమీప ప్రాంతాల నుంచి పలువురిని లైన్ ఆఫ్ కంట్రోల్ దాటించడంలో కీలకంగా వ్యవహరించాడు. కొన్నేళ్లుగా భారత సైన్యం నుంచి తప్పించుకు తిరుగుతున్న అతడు ఎట్టకేలకు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. అతడి చావుతో పీఓకేలోని ఉగ్రమూకలకు పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్టే.


## యూరియా కొరతపై బీఆర్ఎస్ డ్రామాలు

(మొదటి తరువాయి)

చేస్తున్న డ్రామాగా ఆయన అభివర్ణించారు. రేవంత్ సర్కార్‌ను బద్నాం చేసేందుకే బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయం చేస్తోందని విమర్శించారు. యూరియా స్లపైలో నిర్లక్ష్యంపై కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. యూరియాపై బీఆర్ఎస్ నేతలది కపట నాటకమని.. బీఆర్ఎస్ నాటకాలను రైతులు నమ్మరని అన్నారు. అనవసరంగా రైతులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో యూరియా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారంబీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. ముందుగా వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ నేతలు.. యూరియా సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం తెలంగాణ సచివాలయం ముందు బైఠాయించి ఆందోళన చేశారు. ఈ ధర్నాలో హరీష్ రావు, కేటీ-ఆర్, తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ ఆందోళనతో సచివాలయం దగ్గర కాసేపు ఉద్రిక్తత నెలకొంది. దీనిపై మంత్రి తుమ్మల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపికి అనుకూలంగా బిఆర్ఎస్ కావాలనే ఆందోళన చేస్తోందన్నారు. ఎరువులు సరఫరా చేయని కేంద్రాన్ని నిలదీయకుండా గతంలో తాము అంతా గొప్పలు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు.

# సంపాదకీయం

## ప్రవచనాలు



ప్రతి హిందువు త్వరగా పెండ్లి చేసుకుని ముగ్గురు పిల్లల్ని కనాలని ప్రవచించారు. ఎందుకంటే జననాల రేటు తగ్గిపోతోందని, ఇలా తగ్గితే జాతి అంతరిస్తుందని చెప్పారు. జనాభా పెరుగుదల ఒక వరమని సెలవిచ్చారు. దేశంలో ముస్లింల, క్రిస్టియన్‌ల జనాభా కన్నా హిందువులు పెరగాలన్న కోర్కె ఇందులో ఉంది. మన జనాభా తరిగిపోవడం వల్లనే సమస్యలు తలెత్తుతున్నాయనే భావనను ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడున్న జనాభాకే కూడు, గూడు, బట్ట, ఉపాధి, విద్య, వైద్యం, ఉద్యోగం కల్పించలేని స్థితిలో అనేక బాధలతో జనం సతమతమవుతుంటే , నూట నలభై కోట్లకు పెరిగిన జనాభాతో ఉన్న ఇప్పుడు ఈ పిలుపు ఇవ్వడం ఎంత మతితప్పిన వ్యవహారం! ప్రవచనా ఘనుల గురించి మీరు వినే ఉంటారు. ఆధ్యాత్మికం మాటున చేసే ప్రవచనాల వెనకాల రాజకీయ లక్ష్యాలు, గమనాలు స్పష్టంగా ఉంటాయనే విషయం మనం అర్థం చేసుకోవాలి. మన దేశంలో ముఖ్యంగా తెలుగు ప్రాంతంలో టీవీ చానెళ్లలో, సమావేశాల్లో, సభల్లో ప్రవచనాకారుల విజృంభణ విపరీతంగా మొదలైంది తొంభైలలోనే. అంటే అది ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ విస్తృతమవుతున్న సందర్భం. ఆర్థిక వ్యవస్థలో సంక్షోభం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల అన్నీ పెరిగి ప్రజలు సతమతమవుతున్న సందర్భంలో ఈ ప్రవచనాలు విజృంభించాయి. ఈ లౌకిక సుఖాలు, సౌకర్యాలు, బాధలు మొదలైనవన్నీ కర్మఫలితాలనీ, వాటిని అనుభవించక తప్పదనీ, ఎదురయ్యే ఇక్కట్లను, ఏకాగ్రాతతో, ధ్యానంతో శ్వాసపై ధ్యాసతో ఎదుర్కోవాలని బోధించారు. ఈతిబాధలు సర్వసాధారణమని సెలవిచ్చారు. నిరుద్యోగుల మానసిక ఆందోళనలను యోగా ద్వారా పరిష్కరించుకోవాలని, ఆ ఆలోచనలన్నీటినీ ఆధ్యాత్మిక అధ్యయనం ద్వారానే ఎదుర్కోగలమని ప్రవచించారు. మనిషన్న వాడికి సమస్యలెదురవుతాయని, వాటి పరిష్కారం మనలో దాగి ఉంటుందని ప్రసార మాధ్యమాలు ఆనాడు ఏమిటి, ఇప్పటికీ ప్రచారం కొనసాగిస్తూనే ఉన్నది. ఇదొక రకమైన ఆధ్యాత్మికత పేరున సాగిన పరిష్కార ఔషధగుళిక. బాబాలు, రాందేవ్‌లు, చాగంటి లాంటి నిత్యబోధకుల ఉపశమన బోధ కొనసాగిస్తూనే ఉన్నవి. అయితే వాస్తవిక జనజీవనం మరింత కష్టపూరితమవుతున్న విషయం గమనంలోకి వస్తున్నది.ఇక ఇప్పటి పరివారపు ప్రవచనాలు మనమీదికొస్తున్నాయి.ప్రవచనాలన్నింటిలో భాగవత్ ప్రవచనం వేరయా! అని చెప్పుకోవచ్చు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి వందేళ్లు అయిన సందర్భంగా శతాబ్ది ఉపన్యాసాల పరంపరలో ఇటీవల ఢిల్లీలో, దాని ఛీఫ్ మోహన్ భాగవత్ చేసిన ఉద్బోధ చూస్తే చాలా హాస్యాస్పదంగా ఉంటుంది. ఇందులో మూడు విషయాలు వెల్లడించారయన. ఒకటి అబద్ధం, రెండు రాజీ పడటం, మూడు విద్వేషపూరిత పిలుపు, అశాస్త్రీయం. తానెపుడూ, పదవిలో ఉన్నవారు 75 ఏండ్లకు విరమణ పొందాలని ఎవరికీ సూచించలేదని, ఆయన చెప్పిన మాటనే తిరగేసి చెప్పారు. ఇపుడెందుకు మాట మార్చారంటే బహుశా రాజీ ఏదో కుదిరి ఉండవచ్చు. అందులోనే ఆయన కేంద్రంతో సంఘర్షణ ఉంది కానీ గొడవలేదని నుడివారు. ప్రభుత్వంలో మేం కలుగజేసుకోమని సెలవిచ్చారు. మాట మార్చడం, అసత్యాలు వల్లించడం వారికి వెన్నతో పెట్టిన విద్య. మొన్న స్వాతంత్ర్య దినోత్సవ ఉపన్యాసంలో ప్రధాని మోడీ సంఘ్ పరివారాన్ని, వారి సేవాభావాన్ని, దేశభక్తిని ఆకాశానికెత్తిన కారణంగానే ఈ సంఘర్షణ గొడవగా మారలేదేమో! డెబ్బయి అయిదేండ్ల షరతు కూడా తూచ్ అయిపోయింది. శత్రువు–శుత్రువుపట్ల ద్వేషం పెంచే సంఘీయుల వ్యూహంలో భాగమయిన ఆలోచనను,వారి ఛీఫ్ భాగవత్ ప్రవచనంగా ప్రభోధిస్తున్నాడు. ప్రతి హిందువు త్వరగా పెండ్లి చేసుకుని ముగ్గురు పిల్లల్ని కనాలని ప్రవచించారు. ఎందుకంటే జననాల రేటు తగ్గిపోతోందని, ఇలా తగ్గితే జాతి అంతరిస్తుందని చెప్పారు. జనాభా పెరుగుదల ఒక వరమని సెలవిచ్చారు. దేశంలో ముస్లింల, క్రిస్టియన్‌ల జనాభా కన్నా హిందువులు పెరగాలన్న కోర్కె ఇందులో ఉంది. మన జనాభా తరిగిపోవడం వల్లనే సమస్యలు తలెత్తుతున్నాయనే భావనను ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడున్న జనాభాకే కూడు, గూడు, బట్ట, ఉపాధి, విద్య, వైద్యం, ఉద్యోగం కల్పించలేని స్థితిలో అనేక బాధలతో జనం సతమతమవుతుంటే, నూట నలభై కోట్లకు పెరిగిన జనాభాతో ఉన్న ఇప్పుడు ఈ పిలుపు ఇవ్వడం ఎంత మతితప్పిన వ్యవహారం! ముందుగా ఇప్పుడున్న జనాభా సమస్యలను తీరిస్తే, జనాభా పెంచే విషయం ఆలోచించవచ్చును.ఇక అసలైన విద్వేషాన్ని రెచ్చగొట్టే అంశం మధుర, కాశీలలో ముస్లింలు తమ మసీదులను హిందువులకు వదిలేయాలని కోరటం వివాదాన్ని రెచ్చగొట్టే వచనం. ఇది ప్రజల మధ్య చిచ్చుపెట్టే అతి దారుణమైన విషయం.

ఇవన్నీ మత ప్రాతిపదికన ఇస్తున్న పిలుపులు తప్ప, సమాజ శ్రేయస్సును కోరి చెబుతున్న బోధన కాదు. సామాజిక, ఆర్థిక శాస్త్రవేత్తలు జనాభా విషయంలో చేసిన విశ్లేషణలకు ఇది పూర్తి వ్యతిరేకమైనది.అలాగే మధుర, కాశీ దేవాలయాల సమస్యనూ ముందుకు తెచ్చి ప్రజల దృష్టిని మరల్చటం ఎన్నికల్లో లబ్ది పొందటం ఈ ఉద్బోధల వెనుక ఉన్న ఉద్దేశ్యం. అబద్ధాలు, అసత్యాలు, అసమంజస ప్రవచనాల పట్ల జాగ్రత్త వహించాలి. ఏ ప్రవచనాల వెనకాల ఏమి దాగుందో తెలుసుకుని మెదలాలి!

# శ్రీశైలం దేవస్థానంలో ఆక్టోపస్ మాక్ డ్రిల్..!



శ్రీశైలం : ప్రజా స్వేచ్ఛ : భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఆక్టోపస్ బృందం శనివారం మాక్ డ్రిల్స్ నిర్వహించింది. శ్రీశైలం క్షేత్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ డ్రిల్స్ చేపట్టారు. భద్రతాపరమైన అంశాలపై దేవస్థానం కార్యాలయంలో శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్టోపస్ బృందం భద్రతా చర్యలపై వివరించింది. ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆక్టోపస్ విభాగపు డీఎస్పీలు తిరుపతయ్య, సంకురయ్యతో పాటు అధికారులు, తహశీల్దార్ శ్రీనివాసులు, సీఐ జీ ప్రసాదరావు, స్పెషల్ ప్రొటెక్షన్ అధికారులు, అగ్నిమాపక శాఖ అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి, విద్యుత్‌శాఖ అధికారులతో పాటు ఆలయ డిప్యూటీ ఈవో ఆర్ రమణమ్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహారెడ్డి, భద్రతా విభాగపు పర్యవేక్షకులు, ఇన్‌చార్జి భద్రతా అధికారి ఎం మల్లికార్జున, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవస్థానంలో భద్రత విషయంలో తీసుకుంటున్న చర్యలను పీపీటీ ద్వారా వివరించారు.ఆర్మ్‌డ్ గార్డ్స్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, హెూమ్ గార్డ్స్, దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది దేవస్థానంలో అందిస్తున్న సేవలను వివరించారు. వాకీ టాకీలు, డోర్ ఫ్రేమ్స్ డిటెక్టర్ల గురించి తెలియజేశారు. క్యూ కాంప్లెక్స్, క్యూ లైన్ల నిర్వహణ, మహా శివరాత్రి, ఉగాది ఉత్సవాల్లో అదనపు క్యూ లైన్లు, దేవస్థానం పరిధిలోని పార్కింగ్ ప్రదేశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ తిరుపతయ్య మాట్లాడుతూ ఆక్టోపస్ విభాగం విధులు, అనుకోని సంఘటనలు జరిగిన సమయంలో ఆక్టోపస్ సిబ్బంది తీసుకునే చర్యలు, భద్రతకు సంబంధించిన చర్యలపై పీపీటీ ద్వారా వివరించారు. డీఎస్పీ సంకురయ్య మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు భద్రతా పరంగా చేపట్టాల్సిన తక్షణ చర్యలపై వివరించారు. అత్యవసర సమయాల్లో దేవస్థానం, స్థానిక పోలీస్‌లు, రెవెన్యూశాఖ, ఆరోగ్యశాఖ, విద్యుత్‌శాఖ, టెలీ కమ్యూనికేషన్ విభాగాలన్నీ పరస్పర సమన్వయంతో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. సీఐ ప్రసాదరావు మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆక్టోపస్ బృందం మాక్ డ్రిల్ నిర్వహించింది.

# దేశ రాజధాని ఢిల్లీలో దారుణం

### ప్రసాదం కోసం సేవకుడిపై దాడి
### దుండగుల కర్రల దాడిలో మృతి




న్యూఢిల్లీ, : ప్రజా స్వేచ్ఛ :దేశ రాజధాని ఢిల్లీలో ఘోరం జరిగింది. ప్రసాదం వివాదం కారణంగా ఒకరు హత్యకు గురయ్యారు. కొందరు వ్యక్తులు.. ఆలయ సేవకుడిని అత్యంత దారుణంగా కర్రలతో కొట్టి చంపేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయ్యారు. ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ప్రముఖ కల్కాజీ ఆలయానికి కొందరు వ్యక్తులు దర్శనానికి వచ్చారు. సందర్శన తర్వాత ఆలయ సేవకుడు యోగేంద్ర సింగ్(35)ను ప్రసాదం అడిగారు. అడగ్గానే ప్రసాదం అందజేశాడు. మరింత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు యోగేంద్ర సింగ్ నిరాకరించాడు. దీంతో గొడవకు దిగారు. విచక్షణ మరిచిన గ్యాంగ్ కర్రలు తీసుకుని ఆలయ సేవకుడిపై దాడికి పాల్పడ్డారు. ఒక్కడిని చేసి మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. అక్కడికక్కడే యోగేంద్ర సింగ్ ప్రాణాలు కోల్పోయాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయ్యాయి. బాధితుడు ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లాలోని ఫట్టేపూర్ ప్రాంతానికి చెందిన యోగేంద్ర సింగ్ (35)గా పోలీసులు గుర్తించారు. గత 14 నుంచి 15 సంవత్సరాలుగా కల్కాజీ ఆలయంలో సేవాదార్‌గా పనిచేస్తున్నాడు. భక్తులకు ఆచారాలు, నైవేద్యాల విషయంలో సహాయం చేస్తుంటాడు. కానీ కొందరు దుండగులు అకారణంగా కొట్టి చంపేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. స్థానికులు బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది.. అప్పటికే మరణించినట్లుగా వైద్యులు తెలిపారు. భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. దక్షిణపురి నివాసి అయిన 30 ఏళ్ల అతుల్ పాండే అనే నిందితుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు– పోలీసులు పేర్కొన్నారు.

# యుద్ధాన్ని ఆపి శాంతిని స్థాపించండి.. ప్రధాని మోదీకి జెలెన్‌స్కీ ఫోన్..!


న్యూఢిల్లీ, : ప్రజా స్వేచ్ఛ



ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్‌స్కీ తమ దేశంలో యుద్ధాన్ని ఆపి శాంతి స్థాపన కోసం భారత్ కీలకంగా వ్యవహరించాలని కోరారు. తక్షణమే కాల్పుల విరమణ జరిగేలా చర్యలు తీసుకోవాలని, రాబోయే షాంఘై సహకార సంస్థ సదస్సు వేదికగా రష్యాకు బలమైన సందేశం పంపాలని ఆయన ప్రధాని నరేంద్ర మోదీని అభ్యర్థించారు. చైనా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీకి ఉక్రెయిన్ అధ్యక్షుడు ఫోన్ చేసి మాట్లాడారు. గడిచిన నెల రోజుల్లో ఇద్దరు నేతలు ఫోన్‌లో మాట్లాడుకోవడం ఇది రెండోసారి. ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటన ప్రకారం.. జెలెన్‌స్కీ ఉక్రెయిన్‌లోని తాజా పరిణామాలు, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు యూరప్ నేతలతో చర్చల వివరాలు ప్రధానితో పంచుకున్నారు. దీనికి ప్రతిస్పందనగా మోదీ, ఈ సంక్షోభానికి శాంతియుత పరిష్కారమే సరైన మార్గమని భారత్ ఎల్లప్పుడూ విశ్వసిస్తుందని పునరుద్ఘాటించారు.శాంతి సాధన కోసం చేపట్టే అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఇరువురూ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని కూడా ఈ సందర్భంగా చర్చించారు. ఫోన్ సంభాషణ అనంతరం జెలెన్‌స్కీ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. 'మా పట్టణాలపై వరుస దాడులు జరుగుతున్న సమయంలో శాంతి చర్చలు ఫలప్రదం కావు. తక్షణ కాల్పుల విరమణ జరగాలి. ఈ యుద్ధానికి ముగింపు ఇక్కడి నుంచే మొదలవ్వాలి' అని పేర్కొన్నారు. ఎస్‌సీవో సదస్సులో భారత్ రష్యా సహా ఇతర దేశాలకు స్పష్టమైన సంకేతాలు ఇవ్వగలదని ఆశిస్తున్నట్లు తెలిపారు. అలాగే, త్వరలోనే ప్రధాని మోదీని ప్రత్యక్షంగా కలుసుకోవాలనే ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రధాని మోదీ చైనాలోని టియాంజిన్‌లో షాంఘై సహకార సంస్థ హాజరవుతున్నారు.

# ఉక్రెయిన్ యుద్ధానికి ఇండియా కారణం కాదు:

### అమెరికా యూదు కమిటీ



న్యూయార్క్ : ప్రజా స్వేచ్ఛ

రష్యా నుంచి భారత్ ఇంధనం కొనుగోలు చేయడం వల్లే.. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం చేయగలుగుతోందని ఇటీవల అమెరికా ట్రేడ్ అడ్వైజర్ పీటర్ నవర్రో పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే శ్వేతసౌధం సలహాదారుడు చేసిన వ్యాఖ్యలను అమెరికా అమెరికా యూదు కమ్యూనిటీ ఖండించింది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి ఇండియా కారణం కాదు అని, భారత్, అమెరికా మధ్య బంధాన్ని మళ్లీ బలోపేతం చేయాలని యూద వర్గం పేర్కొన్నది.ష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేయడం వల్ల పుతిన్‌కు ఇండియా నిధులు ఇచ్చినట్లు అవుతోందని, దాని వల్లే ఆ దేశం ఉక్రెయిన్‌తో పోరాడుతున్నట్లు శ్వేతసౌధ వాణిజ్య సలహాదారు పీటర్ నవరో ఆరోపించారు. దీంతో అమెరికా, భారత్ మధ్య అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో జువిష్ అడ్వకసీ గ్రూపు స్పందిస్తూ.. భారత్‌పై అమెరికా అధికారులు చేస్తున్న వ్యాఖ్యలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నట్లు పేర్కొన్నది. భారత్ ప్రతిష్టను దిగజార్చే రీతిలో ఆ వ్యాఖ్యలు ఉన్నట్లు యూదు గ్రూపు ఆరోపించింది.పుతిన్ యుద్ధ నేరాలకు భారత్‌ది బాధ్యత కాదు అని, అమెరికాతో భారత్‌కు వ్యూహాత్మక భాగస్వామ్యం ఉన్నదని ఆ గ్రూపు తెలిపింది. విలువైన ఆ బంధాన్ని మళ్లీ గాడిలో పెట్టాలని యూదు గ్రూపు పేర్కొన్నది.

# దారుణ హత్యకు గురైన మాజీ ఉక్రెనియన్ పార్లమెంటరీ స్పీకర్ ఆండ్రిరు

కైవ్ : ప్రజా స్వేచ్ఛ


మాజీ ఉక్రెనియన్ పార్లమెంటరీ స్పీకర్ ఆండ్రిరు పరుబిరు ఎల్విన్ నగరంలో శుక్రవారం దారుణ హత్యకు గురయ్యాడు. ఓ దుండగడు ఆండ్రిరుపై బుల్లెట్ల వర్షం కురింపించాడు. తుపాకీతో అతి దారుణంగా కాల్చి చంపి పరారయ్యాడు. ఈ హత్యను ఉక్రెయిన్ అధ్యక్షుడు తీవ్రంగా ఖండించారు. ఆయన మృతి పట్ల జెలెన్‌స్కీ విచారం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉక్రెయిన్ అంతర్గత వ్యవహారాల మంత్రి ఇహెూర్ క్లైమెంకో, ప్రాసిక్యూటర్ జనరల్ రుస్లాన్ క్రావ్‌చెంకో తెలిపారని.. ఆండ్రిరు కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలుపుతున్నట్లు జెలెన్‌స్కీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఇక ఈ హత్య ఘటనపై తాను అవసరమైన చర్యలన్నింటినీ తీసుకుంటానని చెప్పారు. ఈ ఘటనపై ఆయన దర్యాప్తుకు ఆదేశించారు. పరుబిరు



రాజకీయ నేత. ఈయన 2010లో పార్లమెంటరీ స్పీకర్‌గా పనిచేశారు.

# హైదరాబాద్‌లో బీచ్..

## సముద్ర తీరాన్ని తలదన్నేలా ఏర్పాట్లు



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



**హైదరాబాద్ : ప్రజా స్వేచ్ఛ**
విశ్వనగరం వైపు శరవేగంగా అభివృద్ధి బాటలో పరుగులు పెడుతున్న హైదరాబాద్‌కు ఇన్నాళ్లు ఒకే ఒక్క వెలితి వేధిస్తుండేది. అదే బీచ్.. హైదరాబాద్‌కు బీచ్ లేకపాయే అని నగరవాసులు ఇప్పటికీ తెగ బాధపడిపోతుంటారు. సముద్ర తీర ప్రాంతం అంటేనే మనసుకు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తుంది. అలలతో ఆడుకోవడం, ఇసుక తిన్నెలపై వాకింగ్, బీచ్ ఒడ్డున సన్ బాత్ ఇలా బీచ్‌కు ఉండే స్పెషాలిటీయే వేరు. అదో ప్రత్యేక అనుభూతి. అందుకే భాగ్యనగరవాసులు తరచుగా గోవా, కేరళ, విశాఖపట్నం వంటి సముద్ర తీర ప్రాంతాలకు టూర్ వేస్తూ ఉంటారు. ఇక డబ్బులున్న వారు విదేశాల బీచ్‌లను కూడా సందర్శిస్తుంటారు. అయితే తెలంగాణ వచ్చిన కొత్తలో నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌కు బీచ్‌ను తీసుకొస్తామంటే అంతా నవ్వుకున్నారు. సముద్రమే లేని చోట బీచ్ ఎలా సాధ్యమంటూ ఎగతాళి కూడా చేశారు. అయితే తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో బీచ్ ఏర్పాటుకు ప్రయత్నిస్తుండటం మరింత ఆసక్తిగా మారింది. ఆర్టిఫిషియల్ బీచ్‌ను ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలోనే నగర శివారులోని కొత్వాల్‌గూడలో ఆర్టిఫిషియల్ బీచ్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సుమారు 35 ఎకరాల్లో రూ. 225కోట్ల వ్యయంతో డిసెంబర్ నుంచి దీని నిర్మాణం మొదలుకానున్నట్లు సమాచారం. బీచ్‌లో ఫ్లోటింగ్ విల్లాస్, లగ్జరీ హొటళ్లు, వేవ్ పూల్స్, థియేటర్లు, ఫుడ్ కోర్టులు వంటివి చేర్చనున్నట్లు తెలుస్తోంది. పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పద్ధతిలో ఈ నిర్మాణ పనులు డిసెంబర్, 2025 నుండి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ ఆర్టిఫిషియల్ బీచ్ పర్యాటకులకు మాత్రమే కాకుండా.. నగరవాసులకు వారాంతపు వినోదానికి కేంద్రంగా మారబోతోంది.

# శ్రీరామ్ నగర్ ఎ బ్లాక్ లో బలరాం యాదవ్ ఆధ్వర్యం లో మహా అన్నదానం

**: ప్రజా స్వేచ్ఛ**
**ఆగస్టు 30 శేరిలింగంపల్లి ప్రతినిధి**
శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో కొండాపూర్ శ్రీరామ్ నగర్ కాలనీ ఏ బ్లాక్ లో కొలువైన గణనాధుని వద్ద శనివారం రోజున మహా అన్నదానం జరిగింది, శ్రీరామ్ నగర్ కాలనీ మాజీ ప్రెసిడెంట్ , గల్లి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు బలరాం యాదవ్. ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా 3000 మంది జన సమూహంతో అన్న సమారాధన జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ స్థానిక కార్పొరేటర్ అహ్మద్ పటేల్, సీనియర్ జర్నలిస్ట్ ఉప్పరి శేఖర్ సాగర్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం చేయటం జరిగింది ఈ అన్నదాన కార్యక్రమాలకి చిన్నలు, పెద్దలు, మహిళలు, యువకులు ప్రజలంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు ఈ



సందర్భంగా బలరాం యాదవ్ మాట్లాడుతూ ఈ అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి గల్లి గణేష్ ఉత్సవ కమిటీ తరపున పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు . ప్రతి ఏటా గల్లీ గణేష్. ఉత్సవ కమిటీ తరపున అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఆ గణేష్ మహారాజ్ ప్రతి ఒక్కరినీ చల్లగా చూడాలని అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలు ప్రతి ఒక్కరికి




ఇవ్వాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతున్ని కోరుకున్నట్లు తెలిపారు మరొక్కసారి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో రాజమోహన్ రావు, రమేష్ యాదవ్,పి వెంకటేశ్వర్లు,జైపాలరెడ్డి ,రేపల్లె అశోక్, నాగరాజు యాదవ్ , శ్రీనివాస్, అవధిష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు శాంతియుతంగాజరుపుకోవాలి

## వడ్డె శేఖర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెలటూర్

**పెద్దమండడి /: ప్రజా స్వేచ్ఛ**
గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పది కాలాల పాటు గుర్తుండి పోయేలా,శాంతియుతంగా, ఘనంగా జరుపుకోవాలని గ్రామ వడ్డెర సంఘం అధ్యక్షులు & గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డే శేఖర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ..ముందుగా జిల్లా,మండల,గ్రామ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతున్నానని,శనివారం రోజు ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై సెప్టెంబర్ 6 న నిమజ్జనం చేయనున్నందున,వినాయక మండపాలు ఏర్పాటు చేసే భక్తులు,నిర్వాహకులు భక్తి శ్రద్దలతో,సురక్షిత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.గణేష్ శోభాయాత్ర నిర్వహించే దారిలో గుంతలు పడిన రహదారులు,ప్యాచ్ వర్క్ రిపేర్ పనులు, గణేష్ నిమజ్జనం నిర్వహించే ప్రదేశాల వద్ద క్రెన్లు, బారికేడింగ్,వేదిక ఏర్పాట్లు అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకొని సమన్వయముతో పని



చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా కొనసాగించాలని, మండపాల దగ్గర పరిశుభ్రత పాటించాలని, మండపాల దగ్గరప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని,ఫాగింగ్, సానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. విగ్రహాలు ఊరేగింపు సమయంలో వాహనాల్లో ఎటువంటియాంత్రిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, నిమజ్జనం సమయంలో వేలాడేతీగలు, వంగి ఉన్న చెట్లు,తదితర వాటిని తొలిగించాలని తెలిపారు.పోలీస్ ల సూచనలు తప్పక పాటించాలని వడ్డే శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# మియాపూర్ సి.ఐ. పి. శివ ప్రసాద్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

**: ప్రజా స్వేచ్ఛ శేరిలింగంపల్లి ప్రతినిధి**
మియాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.శివ ప్రసాద్ జన్మదిన వేడుక సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియ జేశారు.
మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్,ఎం.బాబ్జీ,ఎం.ఆర్.కె. చౌదరి, వినోద్ చౌదరి, గోకినేపల్లి రమేష్ ,నాని,మన్నం సుబ్బానాయుడు, సింహా, అభిజీత్, లతో కలిసి



శాలువాతో ఘనంగా సన్మానించి, అభివృద్ధి, శాంతి, సౌభాగ్యానికి ప్రతీకగా ఒక మొక్కను బహూకరించారు. సిఐ శివప్రసాద్ నిండు నూరేళ్ళు వర్ధిల్లాలి అని ఆరోగ్యంగా, ఆనందంగా ఉండి, సమాజ సేవలో విజయవంతంగా ముందుకు సాగాలని మనసారా కోరుకుంటున్నాము అని ఈ సందర్భంగా యలమంచి ఉదయ్ కిరణ్ ఆకాంక్షించారు.

## మాజీ జెడ్పిటిసి కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు



**మెట్ పల్లి : ప్రజా స్వేచ్ఛ**
ఇటీవల శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ కాకతీయ కాలువలో పడి మెట్ పల్లి మాజీ జడ్పిటిసి సభ్యులు మెట్ పల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాటిపల్లి రాధా శ్రీనివాస్ రెడ్డి కుమారుడు శ్రీకర్ రెడ్డి గల్లంతవగా ఈరోజు పెద్దాపూర్ గ్రామంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు శ్రీనివాస రెడ్డిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఇదే మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన పల్లి చొక్కా గౌడ్ మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు వెంట మెట్ పల్లి బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ పల్లి శేఖర్ గౌడ్, వేంపేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజారెడ్డి,అల్లూరి సురేందర్ రెడ్డి,తిరుపతి రెడ్డి, బాపురెడ్డి,రాజమల్లయ్య , శ్రీనివాసగౌడ్,కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతం రాజం,నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎల్లేటి మహిపాల్ రెడ్డి, కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు లింబాద్రి,మల్లాపూర్ మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు నరసయ్య,సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలింగ్ సత్తయ్య మెమోరియల్ పౌండేషన్ ఆధ్వర్యంలో వినాయక మండపాలకు బియ్యం పంపిణీ



**: ప్రజా స్వేచ్ఛ శేరి లింగంపల్లి ప్రతినిధి (అశోక్)**



వినాయక చవితి నవరాత్రుల లో భాగంగా శనివారం రోజు బాలింగ్ సత్తయ్య మెమోరియల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఓల్డ్ హాఫిజ్ పెట్ 109 డివిజన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండ పాలకి తన తండ్రి గారైన కీర్తి శేషులు బాలింగ్ సత్తయ్య స్మారకార్థం బియ్యం సంచులను వినూత్న రీతిలో పంపిణీ చేసిన హాఫిజ్ పెట్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్.ఈ సందర్భంగా గౌతమ్ గౌడ్ మాట్లాడుతూ అన్ని దానాలలో అన్నదానం గొప్పదని అందుకే ప్రత్యేకంగా హాపిజ్ పేట్ డివిజన్ పరిధిలోని అన్ని వినాయక మండపాలకి అన్న సమారాధన కోసం బియ్యం ను భక్తితో పంపిణీ చేసాము అని తెలిపారు. సర్వ విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వర స్వామి వారి నవరాత్రుల కార్యక్రమంలో పాల్గొన్న భక్త మహాశయులకు తాము తలపెట్టే కార్యక్రమంలో విజయాలు సాధించాలని, వారికి స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళల ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్,బాబు,భాస్కర్, మల్లేష్,సాయి,రంజిత్, రాకేష్, శ్రీధర్,కళ్యాణి,నికిల్ తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగికి పలువురు సత్కారం





**: ప్రజా స్వేచ్ఛ పెద్దాపురం ఆగస్టు 30**
శాఖలలో అత్యున్నతమైనది, సేవభావం కలిగినది వైద్య ఆరోగ్య శాఖ,ఈ శాఖలో పనిచేసేవారు భగవంతుని ప్రతిరూపాలుగా చెప్పవచ్చు. అలాంటి ఈ వైద్య ఆరోగ్య శాఖకు వన్నెతెచ్చిన వాళ్ళు కొందరే ఉంటారు.అలాంటి వ్యక్తి శ్రీ యెలిశెట్టి శ్రీనివాసరావు అని పలువురు ప్రశంశించారు. 42 సంవత్సరాలుగా వైద్య ఆరోగ్య శాఖలో పనిచెసిన అయన పదవీ విరమణ కార్యక్రమం కాకినాడ ఎఫ్ ఆర్ టి సి,డి ఎమ్ హెచ్ ఓ ఆఫీస్ ప్రాంగణం లో జరిగింది.ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు అయన సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా ఎర్పాటు చేసిన పదవీ విరమణ సత్కార సభలో ఆయనను ఎఫ్ ఆర్ టి సి సహొద్యోగులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు.

# పరామర్శ

**చిలకలూరిపేట. : ప్రజా స్వేచ్ఛ**
యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామానికి చెందిన మైనారిటీ నాయకుడు షేక్ రసూల్ భార్య అనారోగ్యానికి గురికాగా మాజీ మంత్రి విడుదల రజిని వారి నివాసానికి వెళ్లి వారిని వారిని పరామర్శించారు.
ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అప్పయిపల్లి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం

-పాల్గొన్న వనపర్తి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్స్




: ప్రజా స్వేచ్ఛ వనపర్తి జిల్లా ప్రతినిధి

అప్పయ్య పల్లి గ్రామం లో డిప్యూటీ తాసిల్దార్ చక్రపాణి ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న,వనపర్తి జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్స్ విశ్వం బాబు,ద్యారపోగు వెంకటేష్,కె.వెంకట్ గౌడ్,మాదారి భోజరాజు,ఎడవల్లి వీరప్ప,రెవిన్యూ ఇన్స్పెక్టర్,పంచాయతీ కార్యదర్శి గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.పౌర హక్కుల దినోత్సవం ప్రతినెల చివరి రోజున జరుపుకోవడం జరుగుతుంది ఎస్సీ ఎస్టీల మీద జరిగే అన్యాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని,ఇప్పటికీ ఇంకా ఎస్సీ,ఎస్టీల మీద దాడులు జరుగుతుంటే మా దృష్టికి తీసుకువస్తే చట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని అన్నారు.అందరూ స్వేచ్ఛ సమానత్వం సోదరా భావం కలిగి ఉండాలని,చట్టాలను గౌరవిస్తూఅందరు కులమత బేధం లేకుండా సోదర భావంతో కలిసి ఉండాలని సూచించారు.

## హెచ్ ఐ వి/ఎయిడ్స్ పై బాల్యం నుండే అవగాహన కలిగించాలి

పలుస శంకర్ గౌడ్, జిల్లాసాహితి కళ వేదిక అధ్యక్షులు




ప్రజా స్వేచ్ఛ వనపర్తి జిల్లా ప్రతినిధి.

సమాజాన్ని పట్టి పీడిస్తున్న హెచ్ ఐ వి ఎయిడ్స్ పై ప్రతి ఒక్కరికీ బాల్యం నుండే అవగాహన కలిగించాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని"ఎయిడ్స్ నివారణ సంస్థ"ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు పలు ఆటల పోటీలు,వ్యాసరచన,వక్తృత్వ,పాటల పోటీలను నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పలుస శంకర్ గౌడ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసమాజంలో కొన్ని నయంకాని వ్యాధులు ప్రజలను పట్టి పీడిస్తున్నాయని స్వీయ సంరక్షణ నివారణ ఒక్కటే మార్గమని సూచించారు.వ్యాధులు ప్రబలకుండా ఉండటం మన చేతుల్లోని పని అని చెప్పారుపిల్లలు చిన్నప్పటి నుంచే ఇలాంటి వ్యాధులపై పూర్తిగా తెలుసుకొని జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈనాటి కార్యక్రమంలో నిర్వాహకులు డా.బండారు శ్రీనివాసులు,ఎస్ జి ఎఫ్ సెక్రటరీ కుమార్,కవిజనజ్వాల ,సామాజికవేత్త గంధం నాగరాజు,రేడియంట్ విద్యా సంస్థల అధినేత దేశి రాములు యాదవ్,స్థానిక జనరల్ ఆస్పత్రిసిబ్బందిఇబ్రహీం, రామక్రిష్ణ,శివాని,కాశయ్య, అల్లిబాబు,భాగ్యలక్ష్మి,సన,భాస్కర్ మరియు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.విజేతలకు త్వరలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిచే బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు.

## కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన టి పి సి సి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు



మెట్ పల్లి: ప్రజా స్వేచ్ఛ

:మాజీ జడ్పిటిసి లక్ష్మీ - శ్రీనివాస్ రెడ్డిల కుమారుడు శ్రీకర్ వాగులో గల్లంతయ్యాడు బుధవారం వినాయకుని తరలించే క్రమంలో పెద్దాపూర్ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి వాగులో పడిపోయింది ఈ ప్రమాదంలో నలుగురిలో ముగ్గురు సురక్షితంగా ప్రమాదం నుండి బయటపడగా శ్రీకర్ మాత్రం వాగులో గల్లంతయ్యాడు విషయం తెలుసుకున్న టిపిసిసి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు మాజీ జడ్పిటిసి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.వారితో వ్యవసాయ కమిటీ మార్కెట్ చైర్మన్ కూన గోవర్ధన్ కిసాన్ సెల్ జాయింట్ కోనేటర్ వాకిటి సత్యం రెడ్డి మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఖుతుబోదీన్ పాషా,టీపీసీసీ ఫిషర్మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, మండల అధ్యక్షులు కొమ్ముల చిన్న రెడ్డి నాయకులు నాగరాజ్,గిరిధర్,కల్లెడ గంగాధర్,రాజశేఖర్ రెడ్డి, ఇప్పపెల్లి గణేష్,జాఫర్,అశోక్, రాహుల్,సమీర్, శ్రీకాంత్,రాజేందర్,వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# మాగంటి క్లాస్ అయినా మాస్ లీడరే

- ఎన్టీఆర్‌కు పరమ భక్తుడు
- గోపీనాథ్ అకాల మరణం తీరని లోటు
సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి
- అసెంబ్లీ ఘననివాళి, నేటికి వాయిదా





హైదరాబాద్ : ప్రజా స్వేచ్ఛ

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ఉండి ఇటీవల మరణించిన మాగంటి గోపీనాథ్ చూడటానికి చాలా క్లాస్‌గా కనిపించినా..ఆయన ఆ నియోజకవర్గంలో మాస్ లీడర్‌గా పేరొందారని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఆయన అకాల మరణం సభకు తీరని లోటు అని చెబుతూ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. శాసనసభ వర్షాకాల సమావేశాలు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన శనివారం ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాగానే సీఎం రేవంత్‌రెడ్డి..మాగంటి గోపీనాథ్ మృతికి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోపీనాథ్ విద్యార్థిగా ఉన్న సమయంలోనే 1983 నుంచి టీడీపీలో చురుగ్గా ఉండేవారనీ, 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారని గుర్తుచేశారు. 1987-88లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్‌గా, 1988-93 లో జిల్లా వినియోగదారుల ఫోరం బాధ్యులుగా సేవలందించారని తెలిపారు. సినీరంగంలో నిర్మాతగా రాణించారన్నారు. పార్టీలు వేరైనా మాగంటి గోపినాథ్ వ్యక్తిగతంగా తనకు మంచి మిత్రుడని చెప్పారు. వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ఘనత సాధించిన వారిలో ఆయన ఒకరని కొనియాడారు. ఆయన మృతి బాధాకరమని చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గోపీనాథ్ మరణం దిగ్భ్రాంతికరమన్నారు. ఆయన మానవతావాది, మృదుస్వభావి, నిజాయితీపరుడు అని కొనియాడారు. ఆయన కుటుంబంతో తనకున్న సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సభలో గోపీనాథ్ లేని లోటు కనిపిస్తోందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ సభ్యులు కే.తారకరామారావు(కేటీఆర్) మాట్లాడుత తమ పార్టీ హైదరాబాద్ నగర అధ్యక్షులుగా ఉన్న గోపీనాథ్ మృతికి సంతాపం ప్రకటించాల్సి రావడం బాధాకరంగా ఉందన్నారు. నగరంలో కటౌట్ల కల్చర్ తీసుకొచ్చింది ఆయనేనన్నారు. ఆయన ఆరోగ్య, వ్యక్తిగత, కుటుంబ విషయాలను పెద్దగా ఎవరితోనూ పంచుకునేవారు కాదనీ, నిరంతరం ప్రజా సేవ గురించే ఆలోచించేవారని కొనియాడారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రతి ఏటా మహిళలకు చీరలను పంచుతూ వస్తున్నారనీ, ఆయన స్ఫూర్తితోనే రాష్ట్ర వ్యాప్తంగా ఆ కార్యక్రమాన్ని విస్తరించామని తెలిపారు. గోపీనాథ్ కుటుంబానికి తమ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ..గోపీనాథ్ మృతి బాధాకరమన్నారు. ఆయన మంచి ఆర్గనైజర్ అని చెప్పారు. అందరితోనూ కలివిడిగా ఉండేవారన్నారు. ఎంఐఎం సభ్యులు బలాల మాట్లాడుతూ..మాగంటి సౌమ్యుడనీ, తన పనితాను చేసుకుంటూ పోయేవాడని గుర్తుచేశారు. సాధారణ జీవితం గడుపుతూ జూబ్లీహిల్స్ ప్రజల మనస్సును వరుసగా మూడుసార్లు గెలిచాడన్నారు.

## తెలంగాణ ఉద్యమ నేత డాక్టర్ చెరుకు సుధాకర్ జన్మదిన వేడుకలు

-ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేసిన ఎస్.కె చాంద్



: ప్రజా స్వేచ్ఛ రామన్నపేట ప్రతినిధి



తెలంగాణ ఉద్యమ నేత టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య పాల్గొని డాక్టర్ చెరుకు సుధాకర్ ను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు రామన్నపేట తెలంగాణ ఉద్యమకారులు ఎస్కే చాంద్ ఆధ్వర్యంలో నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ కార్యక్రమం చేసి అక్షరం ఆర్టికల్ చెరుకు సుధాకర్ జీవిత చరిత్రను రాసిన డాక్టర్ అశోక్ కుమార్ తో కలిసి వారికి అందజేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్ నకిరేకంటి అశోక్ బి.లింగం గడ్డం యాదగిరి నాగబాబు మధు ముక్కామల శ్రీనివాస్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు

## గణేష్ నిమజ్జనానికి పగడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజా స్వేచ్ఛ , మెదక్ జిల్లా ప్రతినిధి

మెదక్ జిల్లాలో గణేష్ నిమజ్జనం అంగరంగ వైభవంగా,సురక్షితంగా జరగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు.శనివారం జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస్ రావుతో కలిసి కలెక్టర్ మెదక్ మండల కేంద్రంలోని కోమటూరు చెరువును సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జనం ఘాట్ల వద్ద రక్షణ కంచెలు,లైటింగ్,క్రేన్లు ఏర్పాటు చేయాలని,అవాంఛనీయ ఘటనలు జరగకుండా గజఈతగాళ్లు అందుబాటులో ఉండాలని అన్నారు.అలాగే వైద్య శిబిరాలు,పబ్లిక్ అడ్రస్ సిస్టం, జనరేటర్లను ఏర్పాటు చేసి విద్యుత్ అంతరాయం వల్ల ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ప్రతి ఘాట్ వద్ద పోలీసులు,మున్సిపల్ సిబ్బంది,గజఈతగాళ్ళు,వాలంటీర్లు విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్,సీఐ రాజశేఖర్ రెడ్డి,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఓటర్ లిస్టు చేర్పు,మార్పుల వివరాలు తెలిపిన ఎంపీడీవో

పాల్గొన్న రాళ్ళ కృష్ణయ్య బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు



: ప్రజా స్వేచ్ఛ ఘనపూర్ /వనపర్తి జిల్లా ప్రతినిది

ఘనపూర్ మండల కేంద్రంలోనిమండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అన్ని పార్టీల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఓటర్ లిస్ట్,చేర్పు మార్పుల వివరాలను ఎంపీడీవో కి, వెల్లడించిన బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మామిడి మాడ గోవర్ధన్ రెడ్డి. ఈ సందర్భంగా రాళ్ళ కృష్ణయ్య మాట్లాడుతూ.. మండలంలో మొత్తం ఎంపీటీసీలు 12, గ్రామపంచాయతీలు 29, పోలింగ్ స్టేషన్ లు 59, మండలంలోని మొత్తం ఓటర్ల సంఖ్య 33554 ఉండగా, అందులో పురుషుల ఓట్లు 16,814 స్త్రీల ఓట్లు 16,740 ఉన్నాయి అన్నారు. పోలింగ్ స్టేషన్లలో సదుపాయాలు అన్ని సరిగా ఉండాలని ఒక కుటుంబానికి సంబంధించిన ఓట్లు ఒక్క వార్డులోనే ఉండే విధంగా సరిచూడాలన్నారు. ఆధార్ కార్డు ఆధారంగా చెక్ చేసి ఒక గ్రామంలో ఉన్న ఓటర్ కు మరోచోట ఓటు ఉండకుండా సరి చేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాళ్ళ కృష్ణయ్య అన్నారు.

## జాతీయ కరాటే పోటీలలో నిత్యన్య సిరి ప్రతిభ

అభినందించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు

: ప్రజా స్వేచ్ఛ
మెదక్ జిల్లా



మెదక్ పోలీస్ విభాగానికి చెందిన హెూం గార్డ్ నామ కృష్ణ కుమార్తె నిత్యన్య సిరి, హైదరాబాద్ బోడుప్పల్‌లో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ కాయ్ జాతీయ స్థాయి కరాటే పోటీలలో గోల్డ్ మెడల్స్, గ్రాండ్ ఛాంపియన్షిప్ ట్రోఫీతో క్రీడా ప్రతిభను చాటుకుంది.ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు నిత్యన్య సిరిని సర్టిఫికెట్, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఇప్పటి వరకు 11 జాతీయ బంగారు పతకాలు, రెండు అంతర్జాతీయ బంగారు పతకాలు సాధించడం విశేషమని ఎస్పీ అభినందించారు.జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, ఆర్ఐ శైలేందర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఎస్ఐ నరేష్, మాస్టర్ రవీంద్ర కుమార్, కరాటే మాస్టర్ నగేష్ మల్లూరి, తల్లిదండ్రులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బిజినెస్

## యుపిఐ సేవల్లోకి బిఎస్ఎన్ఎల్..!

### దీపావళి కల్లా ఆవిష్కరించే యోచన




**న్యూఢిల్లీ**

ప్రభుత్వ టెల్కో భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) కొత్తగా డిజిటల్ చెల్లింపుల్లోకి ప్రవేశించడానికి కసరత్తు చేస్తోంది. వచ్చే దీపావళి కల్లా యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) సేవలను ప్రారంభించే పనిలో ఉంది. బిఎస్ఎన్ఎల్ పే పేరుతో దీన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. భారత్ ఇంటర్‌ఫేస్ ఫర్ మనీ (భీమ్) యుపిఐ ఆధారంగా బిఎస్ఎన్ఎల్ పే సేవలను వినియోగించుకునేలా ఈ యాప్‌ను రూపొందిస్తోంది. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఆర్థిక లావేదేవీలు, బిల్లుల చెల్లింపుల కోసం ఫోన్‌పే, గూగుల్ పే, పేటియం లాంటి ప్రయివేటు డిజిటల్ యాప్‌లకు ధీటుగా బిఎస్ఎన్ఎల్ పే సేవలను వినియోగంలోకి తేవాలని నిర్దేశించుకుంది. బిఎస్ఎన్ఎల్ సెల్ఫ్‌కేర్ యాప్‌లో భాగంగానే ఇది ఉంటుందని తెలుస్తోంది. భీమ్ యుపిఐ ద్వారా దీని సేవలను యూజర్లు వినియోగించుకోవడానికి వీలుంటుంది. ఇతర డిజిటల్ చెల్లింపుల యాప్‌ల మాదిరిగానే బిఎస్ఎన్ఎల్ పే పని చేయనుంది. అన్ని రకాల చెల్లింపులు చేయడానికి వీలుంటుంది. తమ వినియోగదారులకు నాణ్యమైన డిజిటల్ సేవలు అందించడంతో పాటు, దేశంలో వేగంగా విస్తరిస్తున్న యుపిఐ చెల్లింపుల మార్కెట్‌లో తాము రాణించాలని బిఎస్ఎన్ఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు తమ మొబైల్, ల్యాండ్‌లైన్, బ్రాడ్‌బాండ్ సేవల బిల్లులను సులభంగా చెల్లింపులు చేసేలా ఇందులో అప్షన్స్‌ను ఇవ్వనుందని తెలుస్తోంది.

## మహిళలకు ఊహించని దెబ్బ.. రికార్డ్ స్థాయిలో పెరిగిన బంగారం ధర!

**న్యూఢిల్లీ**

దేశంలో బంగారం ధరలు మళ్లీ పరుగులు పెడుతున్నాయి. మహిళలకు ఊహించని దెబ్బ కొట్టింది. తగ్గినట్లే తగ్గి ఒక్కసారిగా రికార్డు స్థాయిలో దూసుకుపోతోంది. తలం బంగారం ధర ఇప్పుడు లక్షా 5 వేల రూపాయల వరకు ఉంది. ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నమాట. గత కొన్ని రోజులుగా పసిడి ధరలు ఊగిసలాడుతున్నాయి. శుక్రవారంతో పోలిస్తే శనివారం బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఎగబాకింది. మరి దేశంలో తులం బంగారం ధర ఎంత పెరిగిందో తెలిస్తే మీరే షాకవుతారు. శనివారం మధ్యాహ్నం సమయానికి బంగారం ధరల్లో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. తులం బంగారంపై ఏకంగా 1640 రూపాయలు పెరిగింది. దీని బట్టి చూస్తే ఇంకా ఎంత పెరుగుతుందో ఊహించవచ్చు. తగ్గిటప్పుడు తక్కువ నమోదు అవుతున్నప్పటికీ పెరిగేటప్పుడు మాత్రం రెట్టింపు స్థాయిలో పెరుగుతోంది. ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం ధర



రూ.1640 పెరిగి 1,04,950కు చేరుకుంది. అంటే దాదాపు రూ.లక్షా 5వేల వద్ద నమోదైనట్లే. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధరపై రూ.1200 పెరిగి 96,200 రూపాయల వద్ద ఉంది.

ఇక వెండి విషయానికొస్తే ఇది కూడా నేనెందుకు తగ్గాలి అన్నట్లు 1100 రూపాయలు పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి ధర 1,21,000 ఉంది. ఇక హైదరాబాద్, కేరళ, చెన్నై నగరాల్లో అయితే మరింత ఎక్కువగా ఉంది. ఇక్కడ కిలో సిల్వర్ ధర 1,31,000 ఉంది.

ఇదిలా ఉంటే.. భారతదేశంలో బంగారం ధరలు సామాన్యులకు షాక్ ఇస్తున్నాయనే చెప్పాలి. ఇప్పటికే ఆకాశాన్నంటిన బంగారం ధరలు.. సామాన్యుడు సైతం కొనలేని పరిస్థితి ఉంది. సామాన్యుడు కూతురు పెళ్లి కోసం తులం బంగారం కొనాలంటేనే లక్షా 5 వేల వరకు చెల్లించుకునే పరిస్థితి ఉంది. అలాంటిది సామాన్యుడు కొనాలంటేనే భయపడిపోతున్నాడు. ఇక ఇప్పుడు పండుగ సీజన్ కొనసాగుతోంది. రానున్న రోజుల్లో దసరా, దీపావళి పండలు ఉన్నాయి. ఇంకా మరింత పెరిగే అవకాశం కనిపిస్తోందని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఆగస్టు నెలలో ధరలు తగ్గుతాయని చాలా మంది భావించినప్పటికీ అవేమి జరగలేదు.

**ధరలు పెరగడానికి కారణాలు ఏంటి?**

బులియన్ మార్కెట్ నిపుణుల ప్రకారం.. బంగారం ధరల పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి పెరగడం, డాలర్ విలువలో మార్పులు రావడం, అంతర్జాతీయ మార్కెట్లో బంగారం డిమాండ్ అధికంగా ఉండటం ఇవన్నీ ప్రధాన కారణాలు అని చెబుతున్నారు. అంతేకాదు ద్రవ్యోల్బణం పెరిగిన సందర్భాల్లో చాలా మంది పెట్టుబడిదారులు బంగారం వైపు మళ్లడం వల్ల ధరలు ఇంకా ఎగబాకుతున్నాయి. ఇక రానున్న పండుగ సీజన్‌లో భారత్‌లో బంగారం డిమాండ్ మరింత పెరుగుతుందని అంచనా.

## ఐపీవోకి నెఫ్రోప్లస్

హైదరాబాద్,


హైదరాబాద్ కేంద్రంగా డయాల్‌సిస్ క్లినికల్ నిర్వహణ సంస్థ నెఫ్రోప్లస్ స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి గత నెలలో స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరకాస్తు చేసుకోగా, ప్రస్తుతం గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈక్విటీ షేర్లను జారీ చేయడంతోపాటు ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో షేర్లను విక్రయించడం ద్వారా గరిష్ఠంగా రూ.353.4 కోట్ల నిధులను సేకరించాలనుకుంటుంది. ఇలా సేకరించిన నిధులను దేశీయ, అంతర్జాతీయ వ్యాపార విస్తరణకోసం వినియోగించనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం సంస్థ దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 269 నగరాల్లో డయాల్‌సిస్ సెంటర్లను నెలకొల్పింది.



## సెప్టెంబర్‌లో 40 డిగ్రీల ఎండ.. ఆసియాకప్ షెడ్యూల్‌లో మార్పులు..!

**న్యూఢిల్లీ**

ఆసియా కప్ పోటీలకు తటస్థ వేదికగా ఎంపికైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో ఎండలు మండిపోనున్నాయి. ఎడారి దేశంలో అయినందున సెప్టెంబర్‌లో అక్కడ పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటే అవకాశముంది. ఒకవేళ అదే జరిగితే ఎండవేడికి ఆటగాళ్లు చెమటలు కక్కాల్సిందే. ఉక్కపోత.. వేడి గాలుల తీవ్రతతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మెగా టోర్నీలో ఆటగాళ్లకు ఇలాంటి కష్టాలు రాకూడదని నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. 19 లీగ్ మ్యాచ్‌లతో పాటు ఫైనల్ ఫైట్ సమయంలోనూ మార్పులు చేశారు. సెప్టెంబర్ 9 నుంచి యూఏఈ వేదికగా పదిహేడో సీజన్ ఆసియా కప్ షురూ కానుంది. అయితే.. ఈ నెల ప్రారంభం నుంచి అక్కడ పగటిపూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతాయని, సాయంత్రం 6 గంటల వరకూ ఎండ తీవ్రత కొనసాగనుందని స్థానిక వాతావరణ శాఖ చెబుతోంది. అంతటి ఎండలో మ్యాచ్‌లు అంటే ఆటగాళ్లు హడలెత్తిపోతారు. అందుకే.. బీసీసీఐతో పాటు శ్రీలంక, అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్ బోర్డులు మ్యాచ్‌ల సమయాన్ని మార్చాలని నిర్వాహకులను కోరాయి. ఆసియా దేశాల బోర్డుల అభ్యర్థనపై




సానుకూలంగా స్పందించిన యూఏఈ క్రికెట్.. డే-నైట్ మ్యాచ్‌ల షెడ్యూల్ మార్చింది.

ముందుగా ప్రకటించిన సమయానికి అరగంట ఆలస్యంగా మ్యాచ్‌లు జరపాలని నిర్ణయించింది. అంటే.. సాయంత్రం 6:30 గంటల నుంచి (భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలు)లకు డై-నైట్ మ్యాచ్‌లు మొదలవుతాయి. ఇదే విషయాన్ని బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ అయిన సోనీ స్పోర్ట్స్‌కు తెలియజేశారు నిర్వాహకులు. అయితే.. ఒకేఒక మ్యాచ్ సమయం మాత్రం మారలేదు. సెప్టెంబర్ 15న ఆతిథ్య యూఏఈ, ఒమన్ జట్లు పగటిపూటనే అబుదాబీలోని జయెద్ క్రికెట్ స్టేడియంలో తలపడనున్నాయి.


**రెండు స్టేడియాల్లో..**

ఆసియాకప్‌లో రెండు గ్రూపుల్లోని ఎనిమిది జట్లు కలిపి లీగ్ దశ.. సూపర్ 4 స్టేజ్ వరకూ 19 మ్యాచ్‌లు ఆడుతాయి. సెప్టెంబర్ 9న అఫ్గనిస్థాన్, హాంకాంగ్ మధ్య ఆరంభ పోరు జరుగనుంది. మరుసటి రోజు భారత జట్టు, ఆతిథ్య యూఏఈని ఢీకొట్టనుంది. ఇప్పటివరకూ 8 పర్యాయాలు (ఏడుసార్లు వన్డే ఫార్మాట్, ఒకసారి టీ20 ఫార్మాట్) ఈ మెగా టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచింది టీమిండియా. బ్యాటింగ్ యూనిట్ నిండా విధ్వంసక హిట్టర్లే ఉండడంతో మరోసారి టైటిల్‌తో మురిసిపోవాలనే పట్టుదలతో ఉంది సూర్యకుమార్ యాదవ్ బృందం. దుబాయ్‌లోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, అబుదాబీలోని షేక్ జయెద్ స్టేడియంలో ఆసియా కప్ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

## క్వార్టర్స్‌లోకి సాత్విక్-చిరాగ్ జోడి.. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పతకం ఖాయం !

**న్యూఢిల్లీ**

బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్ లో భారత జోడికి పతకం ఖాయమైంది. జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడి 21-12, 21-19 స్కోరుతో విజయం సాధించారు. మలేషియాకు చెందిన ఒలింపిక్ మెడలిస్టు జోడి ఆరన్ చియా, సోహ్ వూయి యిక్‌లపై గెలుపొందారు. సెమీస్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఇండియన్ జోడికి దాదాపు పతకం ఖాయమైనట్లే. పారిస్ ఒలింపిక్స్‌లో మలేషియా జోడి చేతిలో ఓడిన ఇండియన్ షట్లర్లు ఇవాళ ప్రతీకారం తీర్చుకున్నారు. కేవలం 43 నిమిషాల్లోనే ఈ మ్యాచ్‌ను ముగించారు. మ్యాచ్ గెలవడం అద్భుతంగా ఉన్నట్లు చిరాగ్ తెలిపాడు. మలేషియా ప్రత్యర్థులతో




ఆడడం ఉత్సాహంగా ఉన్నట్లు చెప్పారు. చాలా సార్లు గట్టి పోటీ ఎదుర్కోవాల్సి వచ్చిందని, అయితే ఇవాళ గెలవడం నిజంగా సంతోషంగా ఉన్నట్లు చిరాగ్ చెప్పాడు. 2022 ఈవెంట్‌లో సాత్విక్-చిరాగ్ జోడి బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు మరో పతకాన్ని గెలుచుకోనున్నారు. ఏషియన్ గేమ్స్ చాంపియన్స్‌గా నిలిచిన భారత జోడి మెన్స్ డబుల్స్ సెమీఫైనల్లో 11వ సీట్ ప్లేయర్లు చెన్ బో యాంగ్, లియు యితో తలపడనున్నారు. సెమీస్‌లో ఆడుతున్నప్పుడు అండర్‌డాగ్స్ ఎవరూ ఉండరని చిరాగ్ అన్నాడు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు క్వార్టర్స్‌లో ఓడిన విషయం తెలిసిందే.

# స్పోర్ట్స్

## రాజస్థాన్ రాయల్స్‌కు బిగ్ షాక్..

### హెడ్‌కోచ్‌గా వైదొలిగిన ద్రవిడ్..!



**న్యూఢిల్లీ**

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ ముందు రాజస్థాన్ రాయల్స్ కు బిగ్ షాక్. సుదీర్ఘ కాలానికి హెడ్‌కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన రాహుల్ ద్రవిడ్ అనూహ్యంగా పదవి నుంచి వైదొలిగాడు. స్క్వాడ్‌లో మార్పులపై ఊహాగానాలు వినిపిస్తున్న వేళ ఈ వెటరన్ అకస్మాత్తుగా కోచింగ్ బాధ్యతలకు బైబై చెప్పేశాడు. దాంతో.. మరికొన్నాళ్లు తమ ఫ్రాంచైజీకి కోచ్‌గా ఉంటాడని భావించిన రాజస్థాన్‌కు ఇది ఊహించని షాక్. ఈ దిగ్గజ ప్లేయర్ రాజీనామా చేశాడనే విషయాన్ని రాజస్థాన్ యాజమాన్యం ధ్రువీకరించింది. 'కొన్నేళ్లుగా రాజస్థాన్ రాయల్స్ జర్సీలో ద్రవిడ్ ఆటగాడిగా, కెప్టెన్‌గా, కోచ్‌గా కీలకంగా వ్యవహరిస్తూ వచ్చాడు. నవతరం క్రికెటర్లపై అతడి నాయకత్వం ఎంతో ప్రభావం చూపించింది. స్క్వాడ్‌లో విలువలు పెంపొందించాడు. ఫ్రాంచైజీలో ఒక మంచి సంస్కృతికి శ్రీకారం చుట్టాడు. రాజస్థాన్ ఫ్రాంచైజీ నిర్మాణాత్మక కూర్పులో ద్రవిడ్‌కు కీలక బాధ్యతలు అప్పగించాలనుకున్నాం. కానీ, అతడు మాత్రం సున్నితంగా తిరస్కరించాడు. రాజస్థాన్ ఆటగాళ్లు, లక్షలాది మంది అభిమానులు కోచ్‌గా ద్రవిడ్ విశేషమైన సేవలకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నారు 'అని ఫ్రాంచైజీ ప్రకటనలో వెల్లడించింది. ద్రవిడ్ వైదొలగడంతో డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా ఉన్న కుమార సంగక్కర కు మళ్లీ కోచ్ పగ్గాలు అప్పగిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి.




# రోషన్ కనకాల 'మోగ్లీ' గ్లింప్స్..

## ఆకట్టుకుంటున్న రగ్గడ్ లుక్

యువ కథానాయకుడు రోషన్ కనకాల తన తాజా చిత్రం 'మోగ్లీ 2025'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చిత్ర యూనిట్ ఒక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ గ్లింప్స్‌ను మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లాంచ్ చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ గ్లింప్స్‌లో హీరో నాని వాయిస్ ఓవర్‌తో ప్రారంభం కావడం విశేషం. ఇందులో రోషన్ కనకాల రగ్గడ్ అవతారంలో, పూర్తి కొత్త లుక్‌లో కనిపించి అందరినీ ఆకట్టుకున్నాడు. కథానాయికగా సాక్షి మడోల్కర్, విలన్‌గా బండి సరోజ్ కుమార్ మంచి ఇంపాక్ట్ క్రియేట్ చేశారు. 2025లో అటవీ నేపథ్యంతో సాగే ఒక ప్రేమకథగా ఈ సినిమా రూపొందుతున్నట్లు గ్లింప్స్‌లో చూపించారు. అటవీ సన్నివేశాలు, గ్రాఫిక్స్ సినిమాపై ఆసక్తిని పెంచే విధంగా ఉన్నాయి. ఈ చిత్రానికి కెమెరామెన్‌గా రామ మారుతి.ఎం, సంగీత దర్శకుడిగా కాలభైరవ పని చేస్తున్నారు. ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించే అవకాశం ఉంది.



# మళ్లీ గ్లామరస్ రోల్స్..

## కమ్ బ్యాక్ ఎంట్రీకి కంగనారనౌత్ ప్లాన్..?

ఓ వైపు సినిమాలు, మరోవైపు పాలిటిక్స్.. ఇలా ప్లాట్‌ఫాం ఏదైనా తనదైన బోల్డ్ కామెంట్స్‌తో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తుంటుంది బాలీవ్డ భామ కంగనరనౌత్. చివరగా ఎమర్జెన్సీ సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన ఈ బ్యూటీ గ్లామరస్ రోల్స్ చేయక చాలా కాలమే అవుతుంది. అయితే ఈ బ్యూటీ మళ్లీ తనలోకి గ్లామర్ యాంగిల్‌ను చూపించేందుకు రెడీ అవుతుందన్న వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. బీటౌన్ సర్కిల్‌లో రౌండప్ చేస్తున్న తాజా కథనాల ప్రకారం కంగనారనౌత్ డైరెక్టర్లు వికాస్ బహల్, ఆనంద్ ఎల్ రాయ్‌తో మరోసారి కలిసి చేయబోతుందట. కంగనారనౌత్ ఈ సారి హిట్ ప్రాజెక్టుల సీక్వెల్స్‌తో ట్రాక్‌పైకి వచ్చేలా క్వీన్ 2, తను వెడ్స్ మను 3 సినిమాలను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు ప్లాన్ చేస్తుందని తాజాగా ఓ వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో చక్కర్లు కొడుతోంది. కంగనా ఈ ఏడాది నవంబర్ నుంచి క్వీన్ సీక్వెల్ షురూ చేయనుందని సమాచారం. వికాస్ బాల్ ఇప్పటికే క్వీన్ సీక్వెల్ రెడీ చేశాడని.. ప్రస్తుతం యూకేలో లొకేషన్ల వేటలో ఉన్నాడని బాలీవుడ్ సర్కిల్ సమాచారం. సీక్వెల్ మొదటి పార్ట్ లాగే ఇండియాతోపాటు ఓవర్సీస్ బ్యాక్‌డ్రాప్‌లో కొనసాగనుందని తెలుస్తోంది. ఇక క్వీన్ 2 పూర్తి చేసిన తర్వాత తను వెడ్స్ మను 3ను సెట్స్‌పైకి తీసుకెళ్లాలని ఫిక్స్ అవగా.. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ కూడా పూర్తయినట్టు ఇన్ సైడ్ టాక్. తేరే ఇష్క్ మే తర్వాత ఆనంద్ ఎల్ రాయ్ చేయబోయే ప్రాజెక్ట్ ఇదేనని బీటౌన్ సర్కిల్ సమాచారం. మొత్తానికి ఓ వైపు ఎంపీగా రాజకీయాల్లో బిజీగా ఉన్న కంగనారనౌత్.. ఇక సీక్వెల్స్‌తో మళ్లీ ఫాంలోకి రావాలని గట్టిగానే ప్రయత్నిస్తున్నట్టు తాజా కథనాలు క్లారిటీ ఇచ్చేస్తున్నాయి.

# అతనితో నాకు పెళ్లైంది..

## ఊహించని షాక్ ఇచ్చిన జాన్వీ..

అలనాటి అందాల తార శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ ప్రస్తుతం వరుసగా సినిమాలు చేస్తూ ఇండస్ట్రీలో హీరోయిన్ గా రాణిస్తుంది. దఢక్ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టి వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తుంది జాన్వీ కపూర్. మొన్నటివరకు హిందీలో వరుసగా సినిమాలు చేసి ఆకట్టుకుంది ఈ బ్యూటీ. కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ మూవీస్ లోనూ నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఎప్పటికప్పుడు ప్రయోగాత్మక సినిమాలు చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోతుంది ఈ చిన్నది. ఇక గత ఏడాది ఎన్టీఆర్ కు జోడీగా దేవర సినిమాలో నటించింది. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాతో తెలుగులోకి అడుగుపెట్టింది జాన్వీ. త్వరలోనే దేవర 2 రానుంది. అలాగే మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ సరసన కూడా నటిస్తుంది జాన్వీ కపూర్. బుచ్చిబాబు దర్శకత్వంలో పెద్దిలో హీరోయిన్ గా నటిస్తుంది. ఇక సోషల్ మీడియాలో జాన్వీ అందాలకు యమా క్రేజ్ ఉంది. అందాలు ఆరబోస్తూ కుర్రాళ్లను కవ్విస్తుంది ఈ చిన్నదితాజాగా ఈ ముద్దుగుమ్మ కొన్ని ఆసక్తికర కామెంట్స్ చేసింది. గతంలో నేను చాలా సార్లు నాకు పెళ్లయిందని అబద్ధం చెప్పా.. వేరే దేశాలకు వెళ్ళినప్పుడు నేను ఎక్కువగా ఇలా అబద్ధాలు చెప్తుంటా.. అమెరికా వెళ్ళినప్పుడు నేను ఏదైనా హోటల్ కు వెళ్ళినప్పుడు అక్కడి వెయిటర్స్, రెస్టారెంట్ వాళ్లు నాకు ఫోన్ నెంబర్లు ఇచ్చేవారు. నేను ఆర్డర్ ఇవ్వక ముందే నా టేబుల్ మీదకు ఫుడ్ వచ్చేస్తుంది.. దాంతో ఏం చేయాలో అర్థం కాక నా స్నేహితుడు ఓరీకి నాకు పెళ్లి అయిందని అబద్ధం చెప్పాను. దాంతో వాళ్లు నన్ను పట్టించుకోవడం మానేశారు. నేను ఆ రోజులను ఎప్పటికీ మర్చిపోలేను.. అంటూ చెప్పుకొచ్చింది జాన్వీ కపూర్.



# తరగని వయసుతో కవ్విస్తున్న జెనీలియా

జెనీలియా డిసౌజా.. ఈ బ్యూటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ చిత్రాలలో నటించి మెప్పించింది జెనీలియా. అమితాబ్ బచ్చన్‌తో కలిసి చేసిన పార్కర్ పెన్ వాణిజ్య ప్రకటన ద్వారా జెనీలియా గుర్తింపు పొందింది. 2003లో హిందీ చిత్రం తుఝే మేరీ కసమ్ ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది ఈ అందాల ముద్దుగుమ్మ. అదే సంవత్సరం తమిళ చిత్రం బాయ్స్‌లో నటించి దక్షిణ భారత సినిమాల్లోకి అడుగుపెట్టింది. ఈ సినిమా తెలుగులోనూ విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఇక తెలుగులో సత్యం , సై , బొమ్మరిల్లు , ఢీ, రెడీ , కథ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయింది. ముఖ్యంగా బొమ్మరిల్లు చిత్రంలో ఆమె నటనకు ఫిల్మ్‌ఫేర్ అవార్డు (ఉత్తమ నటి – తెలుగు) లభించింది. తెలుగు ప్రేక్షకుల మనసులో స్థానం సంపాధించుకుంది. హిందీలో మస్తీ (2004), జానే తు... యా జానే నా (2008), తమిళంలో సంతోష్ సుబ్రమణియం (2008) వంటి చిత్రాల్లో నటించి విజయం సాధించింది. పెళ్లి తర్వాత ఈ ముద్దుగుమ్మ సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. ఇక ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టి సినిమాలు చేస్తుంది జెనీలియా. 2012లో బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్‌ను వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు కుమారులు – రియాన్ (2014), రాహిల్ (2016). సినిమాలతో పాటు సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటుంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంటుంది.



Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492